Follow: @ANNTELUGU

22-01-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 51 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## మాజీ సర్పంచులు అల్లాడుతున్నారు



- ఇకనైనా పెండింగ్ బిల్లులు చెల్లించండి
- కలిసికట్టుగా పనిచేద్దాం.... అభివృద్ధి చేసుకుందాం
- కొట్లాడుకునే జమానా పోయింది
- గతంలో నన్ను ఏ కార్యక్రమానికీ పిలవలేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్

02

## జనసేనకు గుడ్ న్యూస్



- గాజు గ్లాసు గుర్తు రిజర్వ్ చేసిన ఎన్నికల సంఘం
- గత ఎన్నికల్లో 100 శాతం స్ట్రయిక్ రేట్ తో జనసేన విజయాలు
- పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో, రెండు ఎంపీ స్థానాల్లో జయభేరి
- పవన్ కల్యాణ్ కు లేఖ పంపిన కేంద్ర ఎన్నికల సంఘం

02

## చిలుకూరు ఆలయంలో ప్రియాంకా చోప్రా



- భగవంతుడి దయ అనంతం అంటూ ఇన్‌స్టాలో పోస్ట్
- మహేష్ రాజమౌళి ప్రాజెక్ట్ కోసమే హైదరాబాద్ వచ్చారని చర్చ

03



## రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం

రాహుల్ పోరాటాన్ని చూసి.. బీజేపీ భయపడుతోంది

ఎన్నికేసులైనా పెట్టుకోండి.. తగ్గేదేలే

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'

కాంగ్రెస్ సదస్సులో ప్రియాంక గాంధీ

మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

వివరాలు 5లో



## టాలీవుడ్‌పై ఐటీ ఎటాక్

### దిల్ రాజు, మైత్రీ టీమ్‌తో సహా ప్రముఖుల ఇళ్ళల్లో సోదాలు

- ఏకకాలంలో విరుచుకుపడ్డ 65 టీమ్‌లు
- మ్యాంగో మీడియా సంస్థల్లో కూడా తనిఖీలు
- ఫైనాన్షియర్స్, లావాదేవీలు కూడా పరిశీలన
- దిల్ రాజు బ్యాంకు లాకర్లు తెరిచి చూసిన అధికారులు

సినిమా ఇండస్ట్రీ వాళ్ళపై ఐటి దాడులు సంచలనం సృష్టిస్తున్నాయి....ఐటీ అధికారులు హైదరాబాదులో దూకుడు పెంచేశారు. ముఖ్యంగా సినీ ఇండస్ట్రీలో ఉన్న అగ్ర నిర్మాతలే టార్గెట్ గా వారి ఇళ్లలో,ఆఫీసుల్లో ఐటీ సోదాలు నిర్వహిస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్, దిల్ రాజు కూతురు హన్సిత రెడ్డి, దర్శకుడు అనిల్ రావిపూడి నివాసాల పై ఐటి అధికారులు సోదాలు చేశారు. దిల్ రాజు ఇల్లు ఆఫీసులతో పాటు ఆయన కూతురు ఇల్లు, బంధువుల ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించారు. . అలా 65 బృందాలుగా ఏర్పడిన ఐటి అధికారులు ఏకకాలంలో 8 ప్రాంతాల్లో ఐటి సోదాలు నిర్వహించారు. ఇక రీసెంట్ గా సంక్రాంతికి విడుదలైన గేమ్ ఛేంజర్,సంక్రాంతికి వస్తున్నాం వంటి రెండు సినిమాలు దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ లోనే విడుదలయ్యాయి. అలా హైదరాబాదులో ఐటి అధికారులు దూకుడు పెంచి ఏకకాలంలో 8 ప్రాంతాల్లో ఐటీ సోదాలు నిర్వహించడంతో ప్రస్తుతం ఈ వార్త మీడియాలో హాట్ టాపిక్ గా నిలిచింది.

-మహా, హైదరాబాద్

వివరాలు 2లో



## తొందరగా కట్టారు

- నిబంధనలు పాటించలేదు
- కాళేశ్వరంపై కమిషన్ కీలక వ్యాఖ్యలు
- నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు
- ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావును విచారించిన జస్టిస్ ఘోష్ కమిషన్

03



రాష్ట్రంలో 4098 గ్రామాలలో

## గ్రామసభలు సక్సెస్

- జిల్లా కలెక్టర్లకు మంత్రుల అభినందనలు
- అర్హులందరికీ ఇళ్ళుకార్డులు మంజూరుచేస్తాం
- రూ.40వేలకోట్లతో నాలుగు పథకాలు
- ఉపముఖ్యమంత్రి భట్టితో సహా మంత్రుల వీడియో కాన్ఫరెన్స్

03



## ఎకరానికి కోటి గుట్టు తేలకుండా ఒగ్గుకథలేమిటి ?

పువ్వుకు పరిమళం,కళాకారుడికి కంఠం' ఉండాలి.మంచి పరిమళం లేని పువ్వుకు విలువలేదు.మంచి గొంతులేని కళాకారునికి భవిష్యత్తులేదు.ఒగ్గుకథా నిర్వహణలో శబ్దం పాత్ర కీలకమైంది.సంభాషణలు, ధ్వన్యనుకరణలు, రాగాలు అన్నీ శబ్దంపైనే ఆధారపడి ప్రవర్తిల్లుతాయి.

04

## దావోస్‌లో తెలంగాణ దూకుడు



### రాష్ట్రంలో యూనీలివర్ యూనిట్లు

- పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్
- బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్
- దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఒప్పందాలు
- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కీలక కంపెనీలతో చర్చలు

**మహా :** తెలంగాణలో రెండు తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు యూనిలివర్ కంపెనీ ముందుకొచ్చింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రెండో రోజున పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది.

మిగతా 2లో

### తెలంగాణలో రాకెట్ తయారీ



## ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో 1000 మందితో భారీ ఎన్‌కౌంటర్

కీలక మావో నేతలు హతం.. మావోల కోసం మూడు రోజులుగా వేట

20 మంది నక్సలైట్లు మృతి.. కోటి రివార్డ్ ఉన్న చలపతి హతం

నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బన్న అమిత్ షా

03

## కార్టూ'నిజం'




## గ్రేటర్ మేయర్‌కు పదవి గండం

### బీఆర్ఎస్ కీలక నిర్ణయం

### అవిశ్వాసంపై చర్చించిన గులాబీ నేతలు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ నివాసంలో దాదాపు రెండు గంటల పాటు సమావేశమై ఈ అంశంపై చర్చించారు. అందులో భాగంగా జీహెచ్ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతో పాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

మిగతా 2లో





## ఈటల ఆగ్రహావేశం


రియల్ ఎస్టేట్ బ్రోకర్ చెంపచెల్లు

పేదల భూములు కబ్జాచేస్తారా అంటూ భగ్గు

వివరాలు 8లో

## అమెరికాలోని భారతీయులకు డొనాల్డ్ ట్రంప్ బిగ్ షాక్

### 18 వేల మంది బహిష్కరణ!



**మహా:** అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే డొనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసదారులపై బహిష్కరణ విధించడం.. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై పని మొదలు పెట్టారు. అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ఇతర దేశాల పౌరులను అందర్నీ గుర్తించి.. వారిని తిరిగి వారి వారి దేశాలకు

మిగతా 2లో

# మాజీ సర్పంచులు అల్లాడుతున్నారు

## ఇకనైనా పెండింగ్ బిల్లులు చెల్లించండి

### కలిసికట్టుగా పనిచేద్దాం.... అభివృద్ధి చేసుకుందాం

### కొట్లాడుకునే జమానా పోయింది.. గతంలో నన్ను ఏ కార్యక్రమానికీ పిలవలేదు


### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు



**కరీంనగర్, మహా :** రాష్ట్రంలో మాజీ సర్పంచులంతా పెండింగ్ బిల్లులు రాక అల్లాడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి రాష్ట్ర ప్రభుత్వం వారి ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే ఆ బిల్లులను చెల్లించి వేలాది మంది సర్పంచులను ఆదుకోవాలని కోరారు. జెండాలను, ఎజెండాలను, బేషజాలను పక్కనపెట్టి అభివృద్ధే లక్ష్యంగా పని చేద్దామని సూచించారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలందిస్తోందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ రోజు సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో రూ. 3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాలు, షాపింగ్ కాంప్లెక్స్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నామని, కొట్లాడుకునే జమానా పోయిందన్నారు. గతంలో ఏ అభివృద్ధి కార్యక్రమానికి తనను పిలవలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, తెలంగాణలో 30 లక్షల మంది రైతులకు ఏటా రూ.6 వేల చొప్పున కిసాన్ సమ్మాన్ నిధి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. యూరియా కొరత లేకుండా చేస్తున్నామని, ఎరువుల మీద ఇప్పటి వరకు దాదాపు రూ.30 వేల కోట్ల రూపాయల సబ్సిడీని తెలంగాణ రైతులకు అందించిన ఘనత మోదీదేనని పేర్కొన్నారు. ఒక్కో యూరియా బస్తా మీద రూ. 2,236 లు సబ్సిడీ ఇస్తున్నామని, రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరత అనేది లేకుండా చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12వేల 769 మంది తాజా మాజీ సర్పంచులున్నారని, వారికి దాదాపు 13 వందల కోట్ల రూపాయలు బిల్లులు రావాల్సి ఉందన్నారు.

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు ఒక్కో సర్పంచుకు 5 లక్షల నుండి కోటి రూపాయల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా పల్లె ప్రగతి,.రైతు వేదిక, వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, హరిత వనం, కమ్యూనిటీ హాల్,.హైమాస్ లైట్స్, అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు వంటి కార్యక్రమాలన్నీ కళ్ల ముందే కన్పిస్తున్నాయని, ఇవన్నీ జరిగాయంటే అది తాజా మాజీ సర్పంచులవల్లేనని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులన్నా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిధులను విడుదల చేయడంవల్లే సాధ్యమైందన్నారు. కానీ చేసిన పనులకు సంబంధించి బిల్లులివ్వకుండా మాజీ సర్పంచులను వేధించడం సరికాదన్నారు. వాళ్లను బాధను అర్థం చేసుకుని వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మానకొండూరు స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గతంలో గన్నేరు వరం బేగంపేట రోడ్డు నిర్మించాలన్నారు, అది సాంక్షన్ కాగానే ఇప్పుడు గన్నేరువరంపై బ్రిడ్జి నిర్మించాలని కోరారంటూ తప్పకుండా ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధే ఎజెండా. నాకైనా ఓట్లేసింది ప్రజలే. కవ్వంపల్లి సత్యనారాయణకైనా, గెలిచిన బీఆర్ఎస్ నేతలకైనా ఓట్లేసింది ప్రజలే.కాబట్టి అందరం కలిసి ప్రజల కోసమే పనిచేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నది నా ఉద్దేశమన్నారు. ఎలాంటి బేషజాలు లేకుండా పనిచేద్దామన్నారు.

## ఇదీ ముచ్చట..




# ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో 1000 మందితో భారీ ఎన్‌కౌంటర్

## కీలక మావో నేతలు హతం.. మావోల కోసం మూడు రోజులుగా వేట

### 20 మంది నక్సలైట్లు మృతి.. కోటి రివార్డ్ ఉన్న చలపతి హతం

### నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బన్న అమిత్ షా



**మహా:** ఛత్తీస్గఢ్ ఒడిశా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి! మావోల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాల్లో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా 1000 మందికిపైగా కలిసి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ సక్సెస్ అయింది. 20 మంది మావోయిస్టులు హతమవ్వగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికీ ఏరివేత కొనసాగుతోంది. ముఖ్యంగా తాజాగా జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందడం గమనార్హం. వారిలో నక్సలిజం కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై గతంలో అలిపిరిలో జరిగిన దాడి కేసులో చలపతి కీలక సూత్రధారి. చిత్తూరు జిల్లా వాసి అయిన అతడిపై రూ.కోటి రివార్డు ఉంది.


**కొన ఊపిరితో నక్సలిజం**

దీంతో నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగు పడిందనే చెప్పాలి. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కూడా అదే విషయాన్ని సోషల్ మీడియాలో తెలిపారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని అన్నారు. నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగు పడిందని వ్యాఖ్యానించారు. తాజా ఎన్కౌంటర్ నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ అని, మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయంగా అభివర్ణించారు.

**నిఘా వర్గాల సమాచారం ఆధారంగా!**

అయితే ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో నిఘా వర్గాల సమాచారం ఆధారంగా జనవరి 19 రాత్రి నుంచి ప్రత్యేక ఆపరేషన్ జరుగుతోంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పుడు కూడా ఆపరేషన్ కొనసాగుతుండడం వల్ల మరింత మావోలు హతమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. 2025లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు కాల్పుల్లో ఇప్పటి వరకు నలభై మంది నక్సలైట్లు మరణించారు. జనవరి 16న బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాల చేతిలో 12 మంది నక్సలైట్లు హతమయ్యారు. ఆ తర్వాత జనవరి 16న జరిగిన కాల్పుల్లో 18 మంది మరణించారని మావోయిస్టులు అంగీకరించారు. గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో 219 మంది నక్సలైట్లను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అలా మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలనే కేంద్రం సంకల్పాన్ని బలోపేతం చేస్తూ భద్రతా దళాలు వరుస విజయాలు సాధిస్తున్నాయని చెప్పాలి.

# టాలీవుడ్‌పై ఐటీ ఎటాక్



**హైదరాబాద్, మహా:** సినిమా ఇండస్ట్రీ వాళ్ళపై ఐటి దాడులు సంచలనం సృష్టిస్తున్నాయి....ఐటీ అధికారులు హైదరాబాదులో దూకుడు పెంచేశారు. ముఖ్యంగా సినీ ఇండస్ట్రీలో ఉన్న అగ్ర నిర్మాతలే టార్గెట్ గా వారి ఇళ్లలో,ఆఫీసుల్లో ఐటీ సోదాలు నిర్వహిస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్, దిల్ రాజు కూతురు హన్సిత రెడ్డి, దర్శకుడు అనిల్ రావిపూడి నివాసాల పై ఐటి అధికారులు సోదాలు చేశారు. దిల్ రాజు ఇల్లు ఆఫీసులతో పాటు ఆయన కూతురు ఇల్లు, బంధువుల ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించారు.. అలా 65 బృందాలుగా ఏర్పడిన ఐటి అధికారులు ఏకకాలంలో 8 ప్రాంతాల్లో ఐటి సోదాలు నిర్వహించారు. ఇక రీసెంట్ గా సంక్రాంతికి విడుదలైన గేమ్ ఛేంజర్,సంక్రాంతికి వస్తున్నాం వంటి రెండు సినిమాలు దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ లోనే విడుదలయ్యాయి. అలా హైదరాబాదులో ఐటి అధికారులు దూకుడు పెంచి ఏకకాలంలో 8 ప్రాంతాల్లో ఐటీ సోదాలు నిర్వహించడంతో ప్రస్తుతం ఈ వార్త మీడియాలో హాట్ టాపిక్ గా నిలిచింది. ఇక గత ఏడాది విడుదలైన పుష్ప టు భారీ కలెక్షన్లను వసూలు చేస్తూ 2000 కోట్ల కలెక్షన్స్ కి చేరువలో ఉన్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్, రవి, సీఈఓ చెర్రీ, మైత్రి సంస్థ భాగస్వాముల ఇళ్లల్లో సోదాలు చేశారు ఇన్ కం టాక్స్ అధికారులు.మరోవైపు టాలీవుడ్ ప్రముఖ సింగర్ సునీత భర్త రాముకు సంబంధించిన మాంగో మీడియా సంస్థలో సైతం సోదాలు నిర్వహించారు

**ఇంకా అనేకమందిపై..**

చాలా మంది నిర్మాత లకు సపోర్ట్ గా ఉండే రిలయన్స్ శ్రీధర్ దగ్గరకు కూడా ఐ టి అధికారులు వెళ్లారు. అభిషేక్ అగర్వాల్ మీద కూడా ఐ టి సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. సత్య రంగయ్య ఫైనాన్స్ కంపెనీ మీద కూడా ఐ టి దాడి జరిగింది. ఇలా ఏకకాలంలో ఐటీ టాలీవుడ్ పై ఎటాక్ చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

## దిల్ రాజు బ్యాంక్ లాకర్లు తెరిచి మరీ..

మరోవైపు ఐటీ రైడ్స్ పై దిల్ రాజు భార్య తేజస్విని స్పందించారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. తమ ఇంటిపై ఐటీ దాడులు జరిగాయన్నారు. తనను బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఐటి వాళ్ళు తీసుకెళ్లారన్నారు. ఐటీ సోదాలు జనరల్ గా జరిగే సోదాలు మాత్రమే.. అన్నారు. ఐటీ శాఖ అధికారులు బ్యాంక్ డీటెయిల్స్ కావాలని అడిగారన్నారు. .బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామన్నారని దిల్ రాజ్ భార్య తేజస్విని తెలిపారు..పరిశ్రమ పై ఐటీ శాఖ అధికారులు దాడులు చెయ్యడం కొత్తేమి కాకపోయినా...ఏకకాలం లో 65బృందాలు సోదాలు నిర్వహించడం ఇదే తొలిసారి...ప్రస్తుతానికి దిల్ రాజు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్నారు... అయితే కొంత మంది రాజకీయ కక్షసాధింపు చర్యగా బావిస్తున్నారు..ఒక్కసారిగా ఐటి అధికారులు పంజా విసరడంతో ఇండస్ట్రీలో అసలు ఏం జరుగుతుంది.. టాలీవుడ్ నిర్మాతలే టార్గెట్ గా ఐటీ సోదాలు ఎందుకు జరుగుతున్నాయని నిర్మాతలు టెన్షన్ పడుతున్నారు. దిల్ రాజు కొన్ని కన్ స్ట్రక్షన్ కంపెనీలలో కూడా పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అక్కడ కూడా సోదాలు జరిగినట్లు తెలుస్తోంది.



### రాష్ట్రంలో 4098 గ్రామాలలో

# గ్రామసభలు సక్సెస్

## జిల్లా కలెక్టర్లకు మంత్రుల అభినందనలు


### అర్హులందరికీ ఇళ్ళు కార్డులు మంజూరుచేస్తాం

### రూ.40వేలకోట్లతో నాలుగు పథకాలు

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా మంత్రుల వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన గ్రామ సభల్లో గతంలో ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోనివారు కూడా ఇప్పుడు చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా పలువురు మంత్రులు స్పష్టం చేసారు. మంగళవారం నుండి 24వ తేదీ వరకు జరుగుతున్న గ్రామ సభల నిర్వహణ, ప్రజల స్పందన, నాలుగు పథకాల కు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సాయంత్రం సచివాలయం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. డిప్యూటీ సి.ఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిలు ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్ల రూపాయలు వ్యయం అవుతాయని వెల్లడించారు. దాదాపు పదేళ్ల తర్వాత రాష్ట్రంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నందున ఈ రెండు పథకాలకు అత్యధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరి అనేది నిరంతర ప్రక్రియ అని, గతంలో దరఖాస్తు చేయని వారు ఈ గ్రామ సభలలో ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే వచ్చిన దరఖాస్తు దారుల్లో ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేని వారి జాబితా గ్రామ సభలలో తెలియచేయాలని, మరెవ్వరైనా దరఖాస్తు చేసుకోక పోతే తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు. ఇప్పటివరకు రేషన్ కార్డుల జారీకి సంబంధించి అర్హులైన వారి జాబితాను ప్రకటించలేదని, అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప అర్హులైన వారిని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. తొలిరోజు జరిగిన గ్రామ సభలు విజయవంతంగా జరిగాయని, ఇందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు. ఈ నాలుగు పథకాలకు సంబందించి స్వీకరించే దరఖాస్తులలో తప్పని సరిగా దరఖాస్తుదారుల పేరు, ఆధార్ కార్డు నెంబర్, చిరునామా, ఇంటి అడ్రస్ తదితర వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. కాగా, రాష్ట్రంలో 4098 గ్రామాలలో గ్రామసభలను విజయ వంతంగా నిర్వహించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రేటర్ మేయర్‌కు పదవి గండం




(మొదటి పేజీ తరువాయి)

అలాగే జీహెచ్ఎంసీపై పట్టు జారకుండా ఉండేందుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. 2020, డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ గమేయర్ పీఠం దక్కించుకునేందుకు కావాల్సినన్ని సీట్లను దక్కించుకోనప్పటికీ ఎంఐఎంతో కలిసి మేయర్ పీఠాన్ని అధిష్టించింది. బంజారా హిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి మేయర్‌గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. ఈ క్రమంలోనే కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి గులాబీ పార్టీకి రాజీనామా చేసి హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. మరోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది. కానీ రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత వారి సంఖ్య 19 కి చేరింది. మరోవైపు ఈ ఏడాది చివరల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. ఇంకోవైపు గతేడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్, బీజేపీలు సరి సమానంగా ఎంపీ స్థానాలను గెలుచుకొన్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు సైతం దక్కలేదు. అలాగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం మేయర్ పీఠం హస్తగతం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళిలతో సిద్ధమవుతోన్నారు.

# అమెరికాలోని భారతీయులకు డొనాల్డ్ ట్రంప్ బిగ్ షాక్


(మొదటి పేజీ తరువాయి)



పంపించేందుకు ట్రంప్ కార్యవర్గం చర్యలు చేపట్టింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని భారత ప్రభుత్వం భావిస్తోందని.. ఫలితంగా వాణిజ్య యుద్ధాన్ని నివారించేందుకు, ట్రంప్‌కు సహకరించేందుకు ఇది ముందస్తు ఆలోచన అని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం.. అమెరికాలో 18 వేల మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నట్లు రెండు దేశాలు గుర్తించాయి. త్వరలోనే ఈ 18 వేల మందిని తిరిగి భారత్‌కు పంపించే అవకాశాలు ఉన్నాయి. అయితే 18 వేల మంది అని చెబుతున్నప్పటికీ.. ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉండే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కానీ అమెరికాలో ఎంతమంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారనే లెక్కలు స్పష్టంగా తెలియరాలేదు. ఇలా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని.. వెనక్కి తీసుకురావడం వల్ల.. ఆ దేశంలోకి సక్రమంగా వెళ్లే భారతీయులకు లాభం చేకూరుతుందని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలోనే హెచ్ 1బీ వీసా కార్యక్రమాన్ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం.. మరింత వేగవంతం చేస్తుందని భారత్ ఆకాంక్షిస్తోంది. అమెరికా అధికారిక లెక్కల ప్రకారం.. 2023 ఏడాదిలో 3.86 లక్షల మంది హెచ్ 1బీ వీసాలు పొందగా.. అందులో దాదాపు మూడింట రెండు వంతుల మంది భారతీయ పౌరులే ఉండటం గమనార్హం. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ డేటా 2024 గణాంకాల ప్రకారం.. అమెరికాకు వెళ్తున్న అక్రమ వలసదారుల్లో 3 శాతం మంది భారతీయులు ఉన్నారు. ఇక మెక్సికో, వెనుజులా, గ్వాటెమాల వంటి లాటిన్ దేశాల నుంచి అమెరికాకు భారీగా అక్రమంగా ప్రవేశిస్తున్నారు. మరీ ముఖ్యంగా అమెరికా ఉత్తర సరిహద్దుల్లో నుంచి భారతీయులు అక్రమంగా ఆ దేశంలోకి చొరబడుతున్నారు. గతేడాది అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఇచ్చిన నివేదిక ప్రకారం.. 2022 నాటికి అమెరికాలో దాదాపుగా 2.20 లక్షల మంది అమెరికాలో అక్రమంగా భారతీయులు నివసిస్తున్న వలసదారులు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. అక్టోబర్ నెలలో అమెరికా నుంచి భారత్‌కు 100 మందికి పైగా అక్రమ వలసదారులను చార్టెడ్ విమానంలో పంపించారు. గత ఏడాది కాలంగా 1100 మందికి పైగా భారతీయులు అమెరికా నుంచి బహిష్కరణకు గురయ్యారు.

# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు గుండెపోటు

## డెహ్రాడూన్‌లో అస్వస్థత.. క్షేమంగా ఇంటికి చేరుకున్ననేత




**మహా:** సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న ఆయనకు మంగళవారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పద్మారావుకు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. డెహ్రాడూన్ నుంచి మంగళవారం రాత్రి వరకు ఆయన సికింద్రాబాద్ చేరుకోనున్నట్లు సమాచారం. తమ అభిమాన నేతకు గుండెపోటు వచ్చిందని తెలియడంతో పద్మారావు అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందాయి. పద్మారావు ఆరోగ్యం నికలడగా ఉందని, పూర్తిగా కోలుకున్నారని వైద్యులు చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, పద్మారావు గౌడ్ మంగళవారం రాత్రి సికింద్రాబాద్ చేరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ పెద్దలు పద్మారావు గౌడ్ ఆరోగ్యంపై ఆరా తీశారు. కాగా, పద్మారావు గౌడ్ కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 1986వ సంవత్సరంలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున మోండా మార్కెట్ నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి జనతాదళ్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ పై కార్పొరేటర్‌గా గెలిచారు. ఆ తర్వాత ఆయన తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితిలో 2001లో చేరి 2002లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో రెండోసారి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు.

# ట్రంప్ మార్క్

## నిర్ణయాలు దబిడిదిబిడే

**చెప్పినట్టుగానే చేసి చూపిస్తున్న ప్రెసిడెంట్**
**క్షణాల్లో కీలక నిర్ణయాలు.. ఆర్డర్ల మీద ఆర్డర్లు**
**అధికారులను పరుగులు పెట్టిస్తున్న నూతన బాస్**



**అగ్రరాజ్యమైన అమెరికా దేశాధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచే తన మార్క్ ను చూపిస్తున్నారు. సంచలన నిర్ణయాలు తీసుకుంటూ హోరెత్తిస్తున్నారు. మొదటిరోజే ఆయన ఏకంగా 42 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ ఇచ్చారు. 115 మంది సిబ్బందిపై, 200 కంటే ఎక్కువ ఎగ్జిక్యూటివ్ యాక్షన్స్ కు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 60 నిమిషాలపాటు మీడియాతో మాట్లాడారు. అదేవిధంగా ఒక్కరోజులో 3 చారిత్రక ప్రసంగాలు ఇచ్చి ట్రంప్ తన మార్క్ ను చూపించుకున్నారు. సమయాన్ని ఏ మాత్రం వృథా చేయకుండా ఈ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో అమెరికాలో మళ్లీ ట్రంప్ హవా ప్రారంభమయ్యిందంటున్నారు. ట్రంప్ ఇలా చేస్తే అంతర్జాతీయంగా గట్టి దెబ్బ ఎదురవడం ఖాయమంటూ సన్నాయి నొక్కులు నొక్కేవారూ ఉన్నారు. ట్రంప్ వీటిని కేర్ చేస్తారా? ట్రంప్ దూకుడుకు సాటెవ్వరు?**

- మహా, ప్రత్యేకం

### అమెరికాకు ఇక స్వర్ణ యుగమే...

నూతన అధ్యక్షుడు ట్రంప్ సంచల నిర్ణయాలు తీసుకుంటూ దూకుడు ముందుకెళ్తుండడంతో భవిష్యత్ లో అమెరికాకు రూపురేఖలు మారనున్నాయని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధిలో అమెరికా పరుగులు పెట్టనున్నదని అంచనా వేస్తున్నారు. ట్రంప్ తీసుకునే నిర్ణయాలు సరైనవేనంటూ మద్దుతు తెలుపుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం చేసి చూపిస్తున్నారంటూ ట్రంప్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కొత్త అధ్యక్షుడు ఇలాగే ముందుకు కొనసాగితే ఇక అమెరికాకు స్వర్ణ యుగమేనంటూ ఆకాంక్షిస్తున్నారు.

### ఖైదీల మార్పిడి ఒప్పందం

ఇదిలా ఉంటే.. అమెరికాకు, తాలిబన్లకు మధ్య ఖైదీల మార్పిడి ఒప్పందం కూడా జరిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. తమ వద్ద ఉన్న అమెరికా ఖైదీలను విడుదల చేస్తామని తాలిబన్ ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. అటు అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న జైలులో జీవిత ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న ఆఫ్గాన్ ఫైటర్ ఖాన్ మహమ్మద్ ను విడిపించుకోవడానికి కూడా తాము ప్రయత్నిస్తున్నామన్నారు. అతడిని తమకు అప్పగించిన వెనువెంటనే తమ వద్ద అమెరికా ఖైదీలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు యూఎస్ తో జరిపిన చర్చలు సఫలమైనట్లు స్పష్టం చేసింది.

### దూకుడు ఎదురుతిరుగుతుందా?

అమెరికా తీసుకుంటున్న తాజా నిర్ణయాలతో యూఎస్ కు కష్టాలు తప్పవన్న అభిప్రాయాలు కూడా వినబడుతున్నాయి. భవిష్యత్ ను అంచనా వేయకుండా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటూపోతున్నారని పలువురు విశ్లేషకులు చెప్పుకొస్తున్నారు. పారిస్ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగినందున వాతావరణ మార్పును ఎదుర్కొనే విషయంలో అంతర్జాతీయ సహకారంలేకుండా పోయిందని, దీంతో తీవ్రమైన వాతావరణ ప్రభావాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడనున్నాయంటున్నారు. అదేవిధంగా అమెరికాకు అంతర్జాతీయ మిత్ర దేశాలు దూరమయ్యే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. అంతేకాదు దౌత్య సంబంధాలు సైతం దెబ్బతీసే అవకాశముందంటూ అంచనా వేస్తున్నారు. ఇటు ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలిగుతూ ట్రంప్ తప్పుడు నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. దీంతో అమెరికా వైద్యారోగ్యం విషయంలో ముప్పును ఎదుర్కొనే అవకాశం లేకపోలేదంటున్నారు.

### ధనాధన్.. ఫటాఫట్

47వ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అమెరికాలో ట్రంప్ మార్క్ కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఖచ్చితంగా ఆఫీసులకు వచ్చి విధుల్లో పాల్గొనాలంటూ ఆదేశాలిచ్చారు. కెనడా, మెక్సికోలపై వచ్చే నెల నుంచి 25 శాతం అదనంగా పన్ను విధించేందుకు ట్రంప్ అల్టిమేటమ్ జారీ చేశారు. ప్యారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు యూఎస్ క్యాపిటల్ పై దాడి చేసిన తన మద్దతుదారులకు ఉపశమనం కల్పించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేశారు. 2021 జనవరి 6న జరిగిన దాడుల్లో పాల్గొన్న 1500 మందికి ట్రంప్ క్షమాభిక్ష పెట్టారు. కాగా, 2020 ఎన్నికల్లో జోబైడెన్ ఎన్నికను అధికారికంగా ధృవీకరించేందుకు కాంగ్రెస్ సమావేశమైంది. ఈ సందర్భంగా ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో వీరికి ట్రంప్ హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే పదవీ బాధ్యతలు చేపట్టిన మరుక్షణమే నిర్ణయం తీసుకున్నారు. అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే జన్మత పౌరసత్వాన్ని తమ ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదంటూ దానిని పూర్తిగా రద్దు చేశారు. దీంతో ఇకనుంచి వలస వచ్చినవారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే ఆ చిన్నారులకు సహజంగా లభించే పౌరసత్వం అందదు. అయితే, వాస్తవానికి అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం పిల్లలకు ఈ హక్కు సంక్రమించాల్సి ఉంటుంది. దాదాపు శతాబ్ధకాలంగా ఈ విధానం అమలులో ఉంది. అక్రమ చొరబాటుదారులకు పుట్టిన పిల్లలకు, టూరిస్ట్ లేదా స్టూడెంట్ వీసాపై వచ్చినవారికి అమెరికాలో కాన్పు అయినవారికి పుట్టిన పిల్లలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. కాగా, దీనిపై ట్రంప్ తాజాగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ జారీ చేయడంతో అది పూర్తిగా రద్దయిపోయింది. ఈ విషయమై న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

### గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు మార్పు

అందరూ ఊహించినట్లుగానే ట్రంప్ మొదటిరోజే గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారిపోయింది. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యుత్తమ, శక్తివంతమైన దేశంగా దాని స్థానాన్ని అది పొందిందంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ప్రదేశాలను మాదక ద్రవ్యాల ముఠాలు నియంత్రిస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే తాను అమెరికా సరిహద్దులను బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు.

### నలుగురు ఉద్యోగులు ఔట్

మరో విషయమేమంటే ట్రంప్ వచ్చి రాగానే ప్రభుత్వంలోని నలుగురు సీనియర్ అధికారులపై బదిలీ వేటు వేశారు. ప్రెసిడెంట్స్ కౌన్సిల్ ఆన్ స్పోర్ట్స్, ఫిట్ నెస్ అండ్ న్యూట్రీషన్, నేషనల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అడ్వైజరీ కౌన్సిల్, ప్రెసిడెంట్స్ ఎక్స్ పోర్ట్ కౌన్సిల్ కు సంబంధించిన నలుగురు ఉన్నతాధికారులను కొత్త అధ్యక్షుడు ట్రంప్ తొలగించారు. అదేవిధంగా మరో వెయ్యి మందిని ఉద్యోగాల నుంచి పూర్తిగా తీసివేస్తానంటూ వారిని హెచ్చరించారు. ప్రస్తుతం అదే పనిలోనే ఉన్నామంటూ పేర్కొన్నారు. తమ హయాంలో అమెరికా మళ్లీ గొప్పగా మారాలని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వ విధానాలను అనుగుణంగా లేని ఉద్యోగులు విధుల్లో కొనసాగలేరన్నారు. దీంతో ఆ ఉద్యోగాలు గుబులు మొదలయ్యింది.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి ఔట్

ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగాలని ట్రంప్ నిర్ణయించాడు. ఈ మేరకు ఆదేశాలను సైతం ఇచ్చాడు. కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో ఈ డబ్ల్యూహెచ్ఓ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ ఆగ్రహంగా ఉన్న ట్రంప్ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, ట్రంప్ నిర్ణయంపై చైనా స్పందించింది. డబ్ల్యూహెచ్ఓ నుంచి అమెరికా వైదొలిగినా తమ పూర్తి మద్దతు ఉంటుందని వెంటనే పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థను మరింతగా బలోపేతం చేయాలి తప్ప బలహీన పరచకూడదన్నది. ఈ మేరకు చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జియాకున్ స్పష్టం చేశారు.

### నియంత్రణలు క్యాన్సిల్

అమెరికాలో పలు రాష్ట్రాల్లో గోడ సామగ్రిని విక్రయించడాన్ని పాత అధ్యక్షుడు జోబైడెన్ ఇచ్చిన ఆదేశాలను ట్రంప్ రద్దు చేశారు. దీంతో ఆ విధానం రద్దయ్యింది. దీనితోపాటు కృత్రిమ మేధ విస్తరణను నియంత్రిస్తూ బైడెన్ జారీ చేసిన ఆదేశాలను సైతం ఆయన తొలగించారు. దీంతో ఏఐ అభివృద్ధి, ప్రయోగాలపై ఎటువంటి నియంత్రణలు ఉండబోవు.

### ట్రంప్ ఎప్పుడూ మంచినీళ్లు తాగలే

అధ్యక్షుడి అభిరుచికి తగ్గట్టుగా అమెరికాలోని వైట్ హౌస్, ప్రభుత్వ ఆఫీసులను అలంకరిస్తారు. ఈ క్రమంలోనే ఓవల్ ఆఫీస్ ను ట్రంప్ అభిరుచికి తగినట్లుగా తీర్చిదిద్దారు. అయితే, గతంలో ఏర్పాటు చేసిన మాదిరిగానే ప్రత్యేక బటన్ ను ఏర్పాటు చేయించారు. ఆ బటన్ ను నొక్కినప్పుడు ఆయనకు డైట్ కోక్, ఇతర అవసరమైన వస్తువులు తెచ్చి ఇస్తారని అంటున్నారు. అయితే ఈ విషయమై ఓ ప్రముఖ సీఈఓ గతంలో కీలక వ్యాఖ్యలు సైతం చేశారు. ట్రంప్ మంచినీళ్లు తాగడం తానెప్పుడూ చూడలేదంటూ ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే.

### అతను మాట వినే రకం కాదు

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ దక్షిణ కొరియాలో ఉన్న అమెరికా సైనికులకు శాటిలైట్ కాల్ చేశారు. ఈ సందర్భంగా వారి మాట్లాడుతూ.. కిమ్ జోంగ్ ఉన్ ఎలా ఉన్నారు..? అక్కడ పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉంది..? ఆయన నాకు మంచి స్నేహితుడు.. అయితే, ఒక్కోసారి ఎవరి మాట వినరు' అంటూ వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతున్నాయి.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం.. ప్రాణత్యాగానికైనా సిద్ధం

## రాహుల్ పోరాటాన్ని చూసి.. బిజెపి భయపడుతోంది.. ఎన్నికేసులైనా పెట్టుకోండి.. తగ్గేదేలే

### జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కాంగ్రెస్ సదస్సులో ప్రియాంక గాంధీ

### మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే




**బెళగావి:** పౌరులు తమ భద్రతకు భరోసా ఇచ్చినట్లే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కోరారు. మంగళవారం బెలగావిలో జరిగిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కాంగ్రెస్ సదస్సులో ఆమె ప్రసంగించారు. రాజ్యాంగ సవరణ ద్వారా ప్రజల హక్కులు, అధికారాలను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పోరాటం నుంచి వెనక్కి తగ్గవద్దు అని ప్రియాంక గాంధీ అన్నారు. రాజ్యాంగం పట్ల ఎలాంటి అగౌరవాన్ని సహించవద్దని ఆమె ప్రజలను కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఆమె ప్రస్తావించారు. “రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం అహోరాత్రులు నిరంతరం పోరాడుతున్నారు. అందుకే బీజేపీ ఆయనకు భయపడుతోంది. వారు అతనిపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేసులు పెట్టారు మరియు అతనిని భయపెట్టడానికి ఈడి దాడులు నిర్వహించింది. కానీ



తాము అలాంటి వ్యూహాలకు భయపడమని, కాంగ్రెస్ పార్టీ వారసత్వం త్యాగం, నిబద్ధతతో ముడిపడి ఉందని ప్రియాంక గాంధీ నొక్కి చెప్పారు. "రాజ్యాంగాన్ని రక్షించడానికి మేము మా ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అంతకుముందు మహాత్మా గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆవిష్కరించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో పాటు కర్నాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డికె శివకుమార్, తెలంగాణ డిసిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

## ఎకరానికి కోటి గుట్టు తేలకుండా

# ఒగ్గుకథలేమిటి ?

పువ్వుకు పరిమళం,కళాకారుడికి కంఠం' ఉండాలి.మంచి పరిమళం లేని పువ్వుకు విలువలేదు.మంచి గొంతులేని కళాకారునికి భవిష్యత్తులేదు.ఒగ్గుకథా నిర్వహణలో శబ్దం పాత్ర కీలకమైంది.సంభాషణలు,ధ్వన్యనుకరణలు,రాగాలు అన్నీ శబ్దంపైనే ఆధారపడి ప్రవర్తిల్లుతాయి. కొన్ని పాత్రలు ఏడ్చే సందర్భంలో కళాకారులు కూడా ఏడుస్తారు,శ్రోతల్నీ ఏడిపిస్తారు.కరీంనగర్ వంటి కొన్ని జిల్లాల్లో పాపులర్ కళారూపమైన 'ఒగ్గుకథ' కు మరణం లేదని బిఆర్ఎస్ నాయకుల 'రైతు దీక్ష'ల ద్వారా అర్థమవుతోంది.ప్రజల్ని తమ యాస,భాషలతో ఆకట్టుకోవడం అనే 'కళ' లో కేసీఆర్ పరివారంతో ఎవరూ పోటీ పడలేరు. రైతులకు అన్యాయం జరిగిపోయిందని ఆ పార్టీ నాయకులు ఇంచుమించు కన్నీళ్లు పెట్టుకోవడం,శ్రోతల్ని ఏడిపించడం ఆ 'పరివారానికి సులువైన పని.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్



''ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ ను మేం చూడాలనుకుంటున్నాం.దేశంలోనే ఆయన ఆదర్శ రైతు. తనకు ఎకరానికి కోటి రూపాయలు ఆదాయం వస్తుందని కేసీఆర్ ప్రకటించారు.తక్కువ పొలంలో ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్న కేసీఆర్,తన ఫాంహౌస్ ను రైతులకు, ఎమ్మెల్యేలకూ చూపించాలి.ఆయన పాటించే వ్యవసాయ పద్ధతులను మేం కూడా నేర్చుకుంటాం''.2015 సెప్టెంబర్ లో తెలంగాణ అసెంబ్లీలో రైతు ఆత్మహత్యలపై చర్చ సందర్భంగా కేసీఆర్ పై తెలంగాణ టీడీఎల్పీ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు సెటైర్ వేశారు.దయాకరరావు ఇప్పుడు బిఆర్ఎస్ పార్టీలో ఉన్నారు.అది వేరే సంగతి.తాను ఒక ఎకరం పంటకు కోటి రూపాయల ఆదాయం వస్తున్నట్టు కేసీఆర్ చెప్పిన విషయం అప్పట్లో ఒక సంచలనం.తెలంగాణలోని మిగతా రైతులకు కూడా ఆ 'ఫార్ములా' తెలిస్తే,ఇక సంక్షోభం,ఆత్మహత్యలు ఎందుకుంటాయి?

కాగా ''కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు.భూములు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకుంటున్నారు.ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.రోజుకొక రైతు రాలిపోతున్నాడు''.అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. హరీశ్ రావు చెబుతున్న రైతుల ఆత్మహత్యల లెక్కలు నిజమైతే బిఆర్ఎస్ నాయకులను 'ప్రాసిక్యూట్' చేయవలసి ఉంటుంది.ఏ రైతు అయినా సోమవారం అప్పు తీసుకొని,మంగళవారం ఆత్మహత్య చేసుకోడు. దానికెంతో పూర్వరంగం ఉంటుంది.కూతురి పెండ్లి కోసమో,కొడుకు చదువు కోసమో,ఇల్లు కట్టుకోవడానికో,ఆస్పత్రి ఖర్చుల కోసమో... ఇంకా ఏవైనా అత్యవసర అవసరాల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోయి,అవి చెల్లించలేక,ఇంకా ఇతరత్రా వ్యవసాయ సంబంధమైన సమస్యల వలన ఆత్మహత్య చేసుకోవడం సాధారణంగా జరిగే ఘటనలు.2023 డిసెంబర్ వరకు తొమ్మిదిన్నర ఏండ్ల పాటు అధికారంలో ఉన్న పార్టీ బిఆర్ఎస్.కేసీఆర్ హయాంలో చేసిన అప్పులు ఇప్పుడు రైతుల పాలిట 'యమ పాశం' గా మారినట్టు ఆ పార్టీ నాయకులు ఒప్పుకోవడానికి ఇష్టపడరు.

'2014 లో కేసీఆర్ సీఎం అయ్యాక ప్రాజెక్టులను నిర్మించి సాగునీటి గోస తీర్చారు.ఫలితంగా సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలనుంచి , 2023నాటికి 2.08 కోట్ల ఎకరాలకు పెరిగింది.వ్యవసాయానికి 24 గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్తు పంపిణీ చేశారు.ఉచిత విద్యుత్తు కోసం కేసీఆర్ రూ. 90 వేల కోట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ జలమాగాణం అయ్యింది. గోదావరి నుంచి 90 టీఎంసీలను కూడా పూర్తిస్థాయిలో వాడుకోలేని దుస్థితి నుంచి గరిష్ఠంగా 400 టీఎంసీలకు పైగా వినియోగించుకొనే స్థాయికి చేరుకుంది .2018లో ప్రారంభించిన రైతుబంధు పథకామ్ కింద రెండు సీజన్లకు కలిపి ఏటా ఎకరానికి రూ. 10 వేల చొప్పున డబ్బును ప్రభుత్వమే పెట్టుబడి సాయం చేసింది.68 లక్షల మంది రైతులకు రూ. 72,817 కోట్లు జమయ్యాయి. ఎరువుల కొరతను తీర్చారు.అంతకు ముందు 25 లక్షల టన్నుల ఎరువుల అవసరం ఉండగా 2022 23నాటికి 40 లక్షల టన్నులకు చేరింది.రెండు విడతల్లో 58 లక్షల మంది రైతులకు చెందిన రూ. 36 వేల కోట్ల రుణాల మాఫీ జరిగింది.2020లో ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది.19.4 లక్షలకు పైగా లావాదేవీలు పూర్తయ్యాయి. 66 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది.2014లో రాష్ట్రంలో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ఇది 2.6 కోట్ల టన్నులకు చేరింది. దేశవ్యాప్తంగా రాష్ట్ర వాటా 14 శాతానికి చేరింది.రైతు మరణిస్తే ఆ రైతు కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఈ స్కీం కింద పరిహారం రూపంలో 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ. 5,566 కోట్లను తెలంగాణ ప్రభుత్వం అందజేసింది'.అని బిఆర్ఎస్ తన సోషల్ మీడియాలో స్వైరవిహారం చేస్తోంది.ఇదంతా నిజమైతే రైతులు సుభిక్షంగా ఉండాలి కానీ ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారన్న సందేహం సాధారణ మనుషులకు కలుగుతుంది.

బిఆర్ఎస్ ప్రాపగాండాను ఎవరు అనుసరించినా వాళ్ళు సులభంగా 'ఇంద్రజాలం'లో చిక్కుకున్నట్టే. బిఆర్ఎస్ మాటలు వింటుంటే అదివరకు కరెంటు లేదని,సాగు లేదని,నీళ్లు లేవని... కేసీఆర్ సీఎం అయిన తర్వాతే ఆయన దూరదృష్టితో తెలంగాణను సుసంపన్నం చేశారని మనకు భ్రమ కలుగుతుంది. రేవంత్ రెడ్డి రాగానే ఒక్కసారిగా పరిస్థితులు తలకిందులయి,రైతులు 'అన్నమో రామచంద్రా' అంటూ అలమటిస్తున్నట్టు,గత్యంతరం లేక బలవన్మరణాలకు పూనుకుంటున్నట్టు బిఆర్ఎస్ నాయకుల విమర్శ.ఇది నమ్మశక్యంగా ఉందా? రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేబట్టి 13 నెలలు కాలేదు.అప్పుడే ఆయన ప్రభుత్వం 'రైతు వ్యతిరేక విధానాలు' అమలు చేసినట్టు,దాని ప్రభావంతోనే రైతులు రాలిపోతున్నట్టు బిఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి అంతూ పొంతూ లేకుండా పోతున్నది.

''ఇప్పుడిప్పుడే గడ్డకు పడినం.ఇంకో పదేండ్లలో తెలంగాణ రైతు,దేశంలోనే గొప్ప రైతుగా గుర్తింపును పొందుతాడు.''! అని కేసీఆర్ రెండేండ్ల చెప్పిన ముచ్చట.కేసీఆర్ పదేండ్ల హయాంలో కేవలం 'గడ్డకు' పడడమే జరిగింది.రైతును రాజు చేయడానికి మరో పదేళ్లు పడుతుందని మనం అర్థంచేసుకోవాలి.''ఈ సారి అధికారంలోకి వస్తే పదిహేనేళ్ళ పాటు బిఆర్ఎస్ కు తిరుగుండదు'' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,పార్టీలో నెంబర్ 3 అయిన హరీశ్ రావు ఇటీవలి కాలంలో తరచూ అంటున్నారు. వాళ్ళ ధీమా పట్ల మనకెందుకు ఆక్షేపణ? ''కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టి ఉంటే తెలంగాణ రైతు ,రాజు అయ్యేవాడు. జస్ట్ మిస్''!! ఇదీ స్థూలంగా బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రాపగాండ.

''తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు.తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దాకా, కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో ఆగమైతున్న తెలంగాణను గాడిలో పెట్టేదాకా పోరాటం కొనసాగుతూ ఉంటుంది.తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం.ఇటువంటి కీలక సమయంలో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇట్లాంటి తమాషాలు జరుగుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు.పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు ప్రజలు బాధపడుతున్నారు'' అని కేసీఆర్ గత ఏడాది జూన్ లో తనను కలిసిన నాయకులతో అన్నారు.

''తెలంగాణ కోసం సాగిన మన 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు.నాడు ఎన్టీఆర్‌ని తిరిగి ఎట్లైతే ప్రజలు గద్దె మీద కూర్చోబెట్టారో అంతకన్నా గొప్పగా బిఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరిగి అంతకంటే రెట్టింపు మద్దతుతో మనలను గద్దె మీద కూర్చుండబెట్టే రోజు త్వరలోనే వస్తుంది.పార్టీ అనేది నాయకులను సృష్టిస్తుంది.నాయకులు పార్టీ లోకి వచ్చి పోతుంటారని కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి తేడా రాదు.బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారు.వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం. బీఆర్ఎస్ పార్టీ బీ ఫార్మ్ ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయిలుగా తయారవుతారు'' అని కూడా అదే సమావేశంలో ఆయన అన్నారు.

కేసీఆర్ ప్రసంగాల్లో పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు కనిపిస్తున్నవి.'పార్టీ నాయకులను సృష్టిస్తుంది' అనే మాట ఆయన నోటి నుంచి రావడం సముచితంగా లేదు.పార్టీని నిర్మించింది తానే,ఆ ఫ్యాక్టరీ నుంచి లక్షలాది మంది కార్యకర్తలను ఉత్పత్తి చేసింది తానే అని చాలా సార్లు ఆయనే చెప్పారు.'బుల్లెట్ వంటి కార్యకర్తలను నాయకులను తయారుచేస్తా' అంటున్నారు.పార్టీ కార్యకర్తలకు ఏనాడయినా కేసీఆర్ కంటి చూపు దొరికిందా?కార్యకర్తల గురించి మాట్లాడుతుంటే వాళ్ళే లైట్ గా తీసుకుంటున్నారు.'కాంగ్రెస్ పార్టీ అలవిగాని హామీలకు జనం మోసపోయారు' అనడం జనాన్ని కించపరచడమే కదా! వాళ్ళు బిఆర్ఎస్ కు ఓట్లు వేసి ఉంటే మోసపోయినట్లు కాదు!

'తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు' అని కేసీఆర్ అంటున్నప్పుడు అధికారం చేజారిపోగానే ఫార్మ్ హౌజ్ కు ఎందుకు పరిమితమైనట్టు? తెలంగాణ సాధించినందున తానే శాశ్వత సీఎంగా తనను తాను ఊహించుకున్నారేమోనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన విన్యాసాలు అన్నీ,ఇన్నీ కావు.దేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, రైతుల స్థితిగతులను మెరుగుపరచడానికి గాను ఒక సదస్సు నాటి 'గడీ భవన్' లో నిర్వహించారు. రైతులు,రైతు సంఘాల నేతలకు వ్యవసాయం,నీటిపారుదల,ఇతర రంగాల్లో తెలంగాణ సాధించిన విజయాల డాక్యుమెంటరీని కేసీఆర్ ప్రదర్శించారు.''కేంద్ర ప్రభుత్వం దిక్కుతోచని పాలన సాగిస్తోందని, పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని దీనికి గల కారణాలను పరిశోధించాలి''అని ఆయన అన్నారు. కేసీఆర్తో జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 100 మంది సీనియర్ రైతు నాయకులు పాల్గొన్నారు.వాళ్లంతా కేసీఆర్ అధికారం కోల్పోగానే మాయమైపోయారు. ప్రజలకు 'సినిమాలు చూపడంలో,అప్పటికప్పుడు అల్లిన పిట్ట కథలు చెప్పడంలో,ఏ రంగంలోని వారినయినా మెస్మరైజ్ చేయడంలో కేసీఆర్ ను మించిన వారు ఈ దేశంలో మరెవరూ ఉండరు' అని ఢిల్లీకి చెందిన సీనియర్ జర్నలిస్టు ఒకరు వ్యాఖ్యానించారు.''తెలంగాణలో 2014లో 898 మంది,2015లో 1358, 2016లో 632 మంది మొత్తం 3వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.కేంద్ర క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం రైతు ఆత్మహత్యల్లో భారతదేశం రెండో స్థానంలో ఉన్నది.అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు 21 వేల కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలోనే తెలంగాణ ప్రథమం''.అని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పారు.బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలకు పోయి అనర్హులకు ఆయాచిత లబ్ధి జరిగిందన్న అధికారపార్టీ విమర్శలకు బిఆర్ఎస్ దగ్గర సరైన జవాబు లేదు.రియల్ ఎస్టేట్ లే అవుట్‌లకు,రాజీవ్ రహదారి,శ్రీశైలం హైవే,క్రషర్లు,మైనింగ్ భూములు ,కోళ్ల ఫారాలు తదితర వ్యవసాయేతర భూములకు కూడా రైతు బంధు ఇచ్చారు.సాగుచేయని భూములకు రూ. 22,606 కోట్లు రైతుబంధు ద్వారా అందిన మాట నిజం.దానికి కేటీఆర్ దగ్గర జవాబు ఉన్నదా?

''సంపద సృష్టించి ప్రతి ఒక్కరికి పంచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నది.కేసీఆర్ హయాంలో లాగా నాలుగు గోడల మధ్యలో కూర్చొని మా అభిప్రాయాలను బలవంతంగా ప్రజలపైన రుద్దడం లేదు.ప్రజల మధ్యనే నిర్ణయాలు తీసుకుటున్నాం''. అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జనవరి 20 న ఖమ్మం పర్యటనలో చెప్పారు. వడగళ్ల వానలతో నష్ట పోయిన రైతాంగానికి ఎకరానికి రూ.10వేలు ఇస్తామని జీవో తీసుకొచ్చి అనాపైస రైతులకు ఇవ్వని కేసీఆర్‌కు రైతుల క్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.బీఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన వైనాన్ని,వరంగల్‌లో మిర్చి రైతులపై లాఠీచార్జి చేయించిన వైనాన్ని కేసీఆర్ పార్టీ నేతలు మార్చిపోయారు.కేటీఆర్ రైతు దీక్ష కార్యక్రమాలు ఒక జోక్ అని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. రైతులను అడ్డు పెట్టుకొని వస్తున్న తండ్రీకొడుకులు,బావ బావమరిది దుష్ప్రచారాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తిప్పిగొట్టాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ కోరారు. ఎరువులు ,కూలీలు,నీటి వనరుల ఖర్చు పెరుగుదల రైతులపై భారం పెరగడం,పత్తి,పసుపు,మిర్చి,కందులు,మినుములు,జొన్న వంటి పంటల ధరలు తగ్గిపోవడం, సుస్థిర వ్యవసాయం లేకపోవడం,ప్రభుత్వ విధానాల లోపాలు,పంట బీమా,మార్కెటింగ్,నిల్వ సదుపాయాల లేమి,నీటిపారుదల వ్యవస్థల లోపాలు వంటి పలు అంశాలు రైతాంగాన్ని అప్పుల్లోకి నెడుతున్నవి.ప్రైవేటు వ్యాపారుల,బ్యాంకుల వడ్డీలు నడ్డి విరుస్తుంటే,కాళ్ల కింద భూమి కదిలిపోతుంటే... బతుకే భారమనుకుని రైతు తనువు చాలిస్తున్నాడు. రైతు ఆత్మహత్యల అంశం దేశవ్యాప్తంగా మూడు దశాబ్దాలుగా జరుగుతున్న చర్చ. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒక విలన్ గా చూపడానికి, రైతాంగంలో ఆయన పట్ల పెద్ద ఎత్తున వ్యతిరేకతను సృష్టించడానికి బిఆర్ఎస్ పార్టీ ఒక ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నట్టు రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ప్రజల్ని తమ యాస,భాషలతో ఆకట్టుకోవడం అనే 'కళ' లో కేసీఆర్ పరివారంతో ఎవరూ పోటీ పడలేరు.రైతులకు అన్యాయం జరిగిపోయిందని ఆ పార్టీ నాయకులు ఇంచుమించు కన్నీళ్లు పెట్టుకోవడం,శ్రోతల్ని ఏడిపించడం ఆ పరివారానికి సులువైన పని.

ఏ రైతు అయినా సోమవారం అప్పు తీసుకొని,మంగళవారం ఆత్మహత్య చేసుకోడు.దానికెంతో పూర్వరంగం ఉంటుంది.కూతురి పెండ్లి కోసమో,కొడుకు చదువు కోసమో, ఇల్లు కట్టుకోవడానికో, ఆస్పత్రి ఖర్చుల కోసమో... ఇంకా ఏవైనా అత్యవసర అవసరాల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోయి,అవి చెల్లించలేక,ఇంకా ఇతరత్రా వ్యవసాయ సంబంధమైన సమస్యల వలన ఆత్మహత్య చేసుకోవడం సాధారణంగా జరిగే ఘటనలు.

''ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ ను మేం చూడాలనుకుంటున్నాం.దేశంలోనే ఆయన ఆదర్శ రైతు.తనకు ఎకరానికి కోటి రూపాయలు ఆదాయం వస్తుందని కేసీఆర్ ప్రకటించారు. తక్కువ పొలంలో ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్న కేసీఆర్,తన ఫాంహౌస్ ను రైతులకు, ఎమ్మెల్యేలకూ చూపించాలి.ఆయన పాటించే వ్యవసాయ పద్ధతులను మేం కూడా నేర్చుకుంటాం''.2015 సెప్టెంబర్ లో తెలంగాణ అసెంబ్లీలో రైతు ఆత్మహత్యలపై చర్చ సందర్భంగా కేసీఆర్ పై తెలంగాణ టీడీఎల్పీ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు సెటైర్ వేశారు.

'ఈ సారి అధికారంలోకి వస్తే పదిహేనేళ్ళ పాటు బీఆర్ఎస్ కు తిరుగుండదు'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,పార్టీలో నెంబర్ 3 అయిన హరీశ్ రావు ఇటీవలి కాలంలో తరచూ అంటున్నారు. వాళ్ళ ధీమా పట్ల మనకెందుకు ఆక్షేపణ? ''కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టి ఉంటే తెలంగాణ రైతు,రాజు అయ్యేవాడు.జస్ట్ మిస్''!! ఇదీ స్థూలంగా బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రాపగాండ.

బీఆర్ఎస్ ప్రాపగాండాను ఎవరు అనుసరించినా వాళ్ళు సులభంగా 'ఇంద్రజాలం'లో చిక్కుకున్నట్టే. బీఆర్ఎస్ మాటలు వింటుంటే అదివరకు కరెంటు లేదని, సాగు లేదని, నీళ్లు లేవని... కేసీఆర్ సీఎం అయిన తర్వాతే ఆయన దూరదృష్టితో తెలంగాణను సుసంపన్నం చేశారని మనకు భ్రమ కలుగుతుంది.రేవంత్ రెడ్డి రాగానే ఒక్కసారిగా పరిస్థితులు తలకిందులయి, రైతులు 'అన్నమో రామచంద్రా' అంటూ అలమటిస్తున్నట్టు, గత్యంతరం లేక బలవన్మరణాలకు పూనుకుంటున్నట్టు బీఆర్ఎస్ నాయకుల విమర్శ.ఇది నమ్మశక్యంగా ఉందా?

ప్రజలకు 'సినిమాలు చూపడంలో, అప్పటికప్పుడు అల్లిన పిట్ట కథలు చెప్పడంలో,ఏ రంగంలోని వారినయినా మెస్మరైజ్ చేయడంలో కేసీఆర్ ను మించిన వారు ఈ దేశంలో మరెవరూ ఉండరు' అని ఢిల్లీకి చెందిన సీనియర్ జర్నలిస్టు ఒకరు వ్యాఖ్యానించారు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# దావోస్‌లో తెలంగాణ దూకుడు



(మొదటిపేజీ తరువాయి)
తెలంగాణ పెవిలియ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు యూనీలివర్ సీఈఓ హీన్ షూ మేకర్, ఆ కంపెనీ చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయి జెన్‌తో చర్చలు జరిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలో పేరొందిన యూనిలీవర్ మన దేశంలో హిందూస్తాన్ లివర్ పేరిట వ్యాపార వ్యవహారాలు నిర్వహిస్తోంది. ఈ చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో ఉన్న వ్యాపార అవకాశాలను వివరించారు. దక్షిణ భారత దేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ వారధిగా ఉంటుందని, అనుకూల వాతావరణంతో పాటు తూర్పు పడమరన ఉన్న మిగతా రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉంటుందని అన్నారు. పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటకు రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను వారితో పంచుకున్నారు. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉందని, సులభతర వ్యాపార విధానాలు అదనపు బలంగా ఉంటాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2050 విజన్ తో రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళిక ప్రపంచంలో అత్యుత్తమంగా అందరినీ ఆకర్షిస్తుందన్నారు. దేశంలో యూనిలీవర్ తయారీ కేంద్రాలున్నప్పటికీ.. ఈ కంపెనీ తెలంగాణలో విస్తరించలేదు. దేశంలో అత్యధికంగా విస్తరణ అవకాశాలున్న వాటిపై దృష్టి సారించి, అటువంటి రంగాల్లోనే పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి కంపెనీ ప్రతినిధులతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. స్పందించిన యూని లీవర్ సీఈవో తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రీ ఫైనింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని, కామారెడ్డి జిల్లాలో తగిన స్థలాన్ని కేటాయిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. యూని లీవర్ బృందం బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేయడానికి కొత్త తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. యూని లీవర్ ఉత్పత్తులు ఎక్కువగా ద్రవ రూపంలో సీసాలలో అమ్ముడవుతున్నాయి. ప్రస్తుతం ఈ బాటిల్ క్యాప్ లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసే యూనిట్ వీటి కొరతను తీర్చనుంది.

# హాసం రాజా ఆపాతమధురం 2

**పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ గురవారెడ్డి.. హాజరైన సినీ సంగీత దర్శకుడు ఆర్ పి పట్నాయక్, మృణాళినీ**



**హైదరాబాద్, మహా :** ప్రముఖ పాత్రికేయులు, మ్యూజికాలజిస్ట్, హాసం సంపాదకులు స్వర్గీయ రాజా రాసిన ఆపాతమధురం 2 పుస్తకాన్ని ఆయన కుమార్తెలు శ్రేష్ఠ, కీర్తన ప్రచురించారు. ఈ పుస్తకావిష్కరణ సభ మంగళవారం జరిగింది. ఆపాతమధురం 2 పుస్తకాన్ని డాక్టర్ గురవారెడ్డి ఆవిష్కరించి తొలి ప్రతిని ప్రముఖ సంగీతాభిమాని, విశ్లేషకులు జె. మధుసూదన శర్మకు అందచేశారు. అనంతరం డాక్టర్ గురవారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ, ``రాజా గారి ఆధ్వర్యంలో వచ్చిన హాసం పత్రిక అంటే నాకెంతో ఇష్టం. అలానే ఆయన నిర్వహించిన వెబ్ సైట్ అంటే కూడా నాకెంతో మక్కువ. దానిని పునరుద్ధరించాల్సిందిగా వారి పిల్లలను కోరుతున్నాను. నాకు తెలిసి రాజా... తెలుగువారికి బినాకా గీత్ మాల అమీన్ సయానీ లాంటి వారు. ఆయన రాసిన ఆపాత మధురం తొలి భాగాన్ని నేను, పామర్రులోని నా స్నేహితురాలు డాక్టర్ భార్గవితో కలిసి ప్రచురించాను. ఇలా పుస్తకాలను ప్రచురించాలనే కోరిక నాకు మా బావ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి నుండి అబ్బింది. రాజా గారు మరికొంతకాలం మనతో ఉండి ఉంటే 1971 వరకూ వచ్చిన పాటలను కూడా విశ్లేషించి ఉండేవారు. కనీసం ఆ పనిని మధుసూదనశర్మ గారు చేస్తే, దానిని పుస్తకంగా తీసుకొచ్చే బాధ్యతను నేను స్వీకరిస్తాను'' అని అన్నారు. ఆత్మీయ అతిథి సి. మృణాళిని మాట్లాడుతూ, రాజాగారు పాటను సంగీతపరంగా, సాహిత్యపరంగా లోతైన విశ్లేషణ చేసేవారు. సంగీత దర్శకుల బాణీని, గీత రచయితల పదాలను జాగ్రత్తగా గమనించి, వాటిని గురించి వివరించేవారు. ఇలాంటి విశ్లేషణల కారణంగా మన పద సంపద పెరుగుతుంది. సాహిత్యాన్ని ఎంతో పరిశోధన చేయబట్టే ఆయన అంతాలా దానిని వివరించేవారు అనిపిస్తుంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్. పి. పట్నాయక్ మాట్లాడుతూ, పాట ఎప్పుడు పుట్టింది? ఎలా పుట్టింది? అనే వివరాలను `పాట అనే కార్యక్రమం ద్వారా అందించాలని అనుకున్నాను. అందుకు నాకు సంపూర్ణ సహకారం అందిస్తానని రాజా గారు మాట ఇచ్చారు. కానీ దానిని నెరవేర్చకుండానే ఆయన మనల్ని విడిచి వెళ్ళిపోయారు` అంటూ వాపోయారు. ఇప్పుడు ఇక్కడ మన మధ్య ఉన్న మధుసూదన శర్మ గారైనా... నెక్స్ జనరేషన్ కు తన దగ్గర ఉన్న సమాచారాన్ని అందించాలని ఆర్.పి. పట్నాయక్ కోరారు. మ్యూజికాలజిస్ట్ రాజాతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని, ఈ పుస్తక ప్రచురణ కర్త డాక్టర్ వరప్రసాద్ రెడ్డి ఆహుతులకు తెలిపారు. రాజాకు సంగీతం పట్ల ఉన్న పట్టు తెలిసిన వ్యక్తిగా ఆయన సంపాదకత్వంలో హాసం పత్రికను ప్రారంభించానని, అయితే అనివార్య కారణంగా దానిని ఆపివేయాల్సి వచ్చిందని, చాలా మంది ఇప్పటికీ హాసం పత్రిక ఆగిపోవడానికి కారణాలు అడుగుతుంటారని, రాజీ పడలేని రాజా మనస్తత్వం కారణంగానే ఆ పత్రికను తాను ఆపేశానని, రాజా గారు లేని హాసం పత్రికను తీసుకురావడం తనకు ఇష్టం లేకపోయిందని వరప్రసాదరెడ్డి తెలిపారు. ఇప్పటికీ హాసం ప్రచురణలు పేరుతో పుస్తకాలను ప్రచురిస్తున్నామని అన్నారు. రాజా రాసిన ఆపాతమధురం 2 పుస్తకాన్ని తీసుకురావడం కోసం అమెరికాలో ఉండే ఆయన కుమార్తెలు శ్రేష్ఠ, కీర్తన ఎంతో శ్రమించారని అంటూ వారిద్దరినీ వరప్రసాద్ రెడ్డి అభినందించారు. రాజాగారి తరహాలోనే ఆయన కుమార్తెలు తన మీద అభిమానంతో ఈ పుస్తకాన్ని తనకు అంకితం ఇవ్వడం పట్ల మధుసూదన శర్మ ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ గీత రచయిత భాస్కరభట్ల రవికుమార్ హాసం రాజాతో తనకున్న అనుబంధాన్ని తెలియచేశారు. ఈ పుస్తకం తీసుకు రావడానికి తమకు సహకరించి వారికి రాజా పెద్ద కుమార్తె శ్రేష్ఠ ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే మ్యూజికాలజిస్ట్ రాజా వెబ్ సైట్ ను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణలో రాకెట్ తయారీ

## స్కైరూట్ తో సర్కార్ ఒప్పందం

**గర్వకారణమన్న సీఎం రేవంత్ రెడ్డి**

**రూ.500కోట్ల పెట్టుబడికి అంగీకారం**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాకెట్ తయారీ కేంద్రం కాబోతోంది. దావోస్ లో సీఎం రేవంత్ రెడ్డి టీమ్ పెట్టుబడుల వేటలో దూకుడుగా విజయాలు సాధిస్తోంది. తెలంగాణకు ఇప్పటికే యూనీలీవర్ సంస్థ నుండి పెట్టుబడులు రాగా, మరో కీలక ఒప్పందానికి సీఎం శ్రీకారం చుట్టారు. తెలంగాణలో ఏకంగా ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకై స్కైరూట్ కంపెనీతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని బృందం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంపై ఇదొక శుభపరిణామమని సీఎం స్పందించారు. హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక రంగంలోని కంపెనీ స్కైరూట్ ఏరో స్పేస్‌తో దావోస్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో అవగాహన ఒప్పందం ఎంఓయుపై సంతకం చేశారు. ఒప్పందం ప్రకారం తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు స్కైరూట్ కంపెనీ దాదాపు రూ. 500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఒప్పందం పట్ల తన ఆనందం వ్యక్తం చేశారు.

**సాంకేతికరంగంలో విజయం గర్వకారణం- సీఎం**

హైదరాబాద్ కు చెందిన సంస్థ అత్యాధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన యువకులు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించటంతో పాటు, రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు అభినందించారు. స్కైరూట్ కంపెనీతో ప్రభుత్వ భాగస్వామ్యం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెపుతుందని అన్నారు. త్వరలోనే హైదరాబాద్ ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామన్నారు.

# తొందరగా కట్టారు నిబంధనలు పాటించలేదు

## కాళేశ్వరంపై కమిషన్ కీలక వ్యాఖ్యలు

**నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు**

**ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావును విచారించిన జస్టిస్ ఘోష్ కమిషన్**

**పరిశ్రమలకు నీళ్లు అమ్మి రెవెన్యూ జనరేటర్ చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యం రామకృష్ణా రావు**

**నేటి నుండి ఏజెన్సీల విచారణ**



**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం అవకతకల విచారణకు ఏర్పడిన కమిషన్ ముందు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణారావు సమావేశమయ్యారు. కాళేశ్వరం కార్పొరేషన్ లోన్స్ ప్రాజెక్టు డిజైన్ లు, బడ్జెట్ కేటాయింపుల అంశాలపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. కార్పొరేషన్ కు నిధులు ఎలా సమకూర్చారని కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించింది. డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా అని కమిషన్ ప్రశ్నించగా, కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని రామకృష్ణ రావు పేర్కొన్నారు. డిజైన్లను అప్రూవల్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదని, కమిషన్ వ్యాఖ్యానించింది. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు రామకృష్ణ రావు స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ తొందరగా కట్టారు కానీ నిబంధనలు పాటించలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం రెవెన్యూ జెనరేట్ ఎలా చేస్తారు? అని కమిషన్ ప్రశ్నించింది. పరిశ్రమలకు నీళ్లు అమ్మి రెవెన్యూ జనరేటర్ చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యమని రామకృష్ణ రావు వివరణ ఇచ్చారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీస్ పెట్టలేదని రికార్డులను కమిషన్ చూపింది. ప్రాజెక్టుకు సంబంధించిన ఫైల్స్ ప్రాపర్ గా క్యాబినెట్ ముందుకు రాలేదని, నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదని కమిషన్ పేర్కొంది. రామకృష్ణారావుకు నిబంధనలు పాటించని అంశాల రికార్డులను చూపించడంతో ఆయన అంగీకరించారు. ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులను మైంటైన్ చేయలేదని కమిషన్ పేర్కొనగా, ప్రాజెక్టు కోసం ప్రభుత్వం గ్యారెంటీ తోటే లోన్స్ కార్పొరేషన్ తీసుకుందని, ప్రతి ఏడాదికి ప్రిన్సిపల్ అమౌంట్ తో కలిపి 7300 కోట్ల రూపాయలు వడ్డీ కడుతున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తీసుకున్న లోన్స్ కి 9నుంచి 10.5 శాతం వడ్డీతో రీ పేమెంట్ చేస్తున్నామని వెల్లడించారు.

**కాళేశ్వరం ముందుకు ఏజెన్సీ సంస్థలు**

కాళేశ్వరం కమిషన్ ముందుకు ఏజెన్సీ సంస్థలు రానున్నాయి. బుధవారం నుంచి వరసగా మూడు రోజులు పాటు ఏజెన్సీ సంస్థలను కాళేశ్వరం కమిషన్ విచారించనుంది. కమిషన్ ముందుకు మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల నిర్మాణ సంస్థలు రానున్నాయి. బుధవారం నవయుగ, గురువారం ఎల్ & టీ, శుక్రవారం అఫ్కాన్స్ ఏజెన్సీ సంస్థలు విచారణకు రానున్నాయి.



# కడప జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా జంగిటి వెంకట సుబ్బారెడ్డి నియామకం

- **అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా - వెంకటసుబ్బారెడ్డి**
- **ఎపికి మోడి ఎంతో చేస్తున్నారు - మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి**

**కడప , మహా :** కడప జిల్లా బిజెపి నూతన అధ్యక్షుడిగా జంగిటి వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఇదివరకు ఈయన జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీ పట్ల విధేయతగా ఏ బాధ్యతలు అప్పగించిన సమర్థవంతంగా నిర్వహించడంతో పార్టీ అధిష్టానం వెంకటసుబ్బారెడ్డిని నియమించింది. మంగళవారం నగరంలోని ఐఎంఏ హాల్లో నిర్వహించిన పార్టీ సంస్థ ఎన్నికల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు గుడిశ దేవానంద్, జిల్లా రిటర్నింగ్ ఆఫీసర్ శాంతారెడ్డి, జమ్మలమడుగు ఎంఎల్ఏ ఆదినారాయణ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శశి భూషణ్ రెడ్డిలు పాల్గొని ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళ్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని బలోపేతం చేస్తానన్నారు. పార్టీ పెద్దల సలహాలు సూచనల మేరకు ముందుకు వెళ్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా చాలామంది జిల్లాలో బీజేపీకి ఓట్లు లేవని, తనను ఓడిపోతావని చెప్పడం జరిగిందన్నారు. అయితే ప్రజల మద్దతుతో తాను 18 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం జరిగిందన్నారు. ఇప్పటివరకు శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ బలోపేతం అయిందన్నారు. రాష్ట్రంతోపాటు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోట్లాది రూపాయల పనులు కొనసాగుతున్నాయన్నారు. మోదీ కారణంగానే అభివృద్ధి పరంగా అన్ని విధాల ముందుకు సాగడం జరుగుతోందని వివరించారు. రాబోయే కాలంలో జిల్లాలో వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారి శాంతారెడ్డి, ఎన్నికల పరిశీలకులు గుడిసె దేవానంద్, జిల్లా కో రిటర్నింగ్ అధికారి బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఈటల ఆగ్రహావేశం

**రియల్ ఎస్టేట్ బ్రోకర్ చెంపచెల్లు.. పేదల భూములు కబ్జాచేస్తారా అంటూ భగ్గు**

**మేడ్చల్ మల్కాజిగిరి, మహా:** రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేయి చేసుకోవడం సంచలనంగా మారింది. జిల్లాలోని పోచారం మున్సిపాలిటీ ఏకశిల నగర్‌లో ఎంపీ పర్యటించారు. ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ పేదల భూములు కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో పేదల భూములు కబ్జా చేయడంతో ఆగ్రహించిన రాజేందర్ స్థిరాస్తి వ్యాపారిపై దాడి చేశాడు. ఇదే సమయంలో ఎంపీ అనుచరులు, బాధితులు సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడికి పాల్పడ్డారు. రద్దయిన ఏకశిల వెంచర్లో రియల్ బ్రోకర్స్ అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ ఈటల బ్రోకర్లపై చేయి చేసుకున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేదల భూములు కబ్జా చేస్తూ తమ భూములంటూ అడిగిన పేదలపై దాడికి దిగిన వారిని బెదిరించడంతో ఈటల రంగప్రవేశం చేశారు. ఈటలే నేరుగా చేయిచేసుకోవడంతో బిజెపి కార్యకర్తలు కూడా చేతులకు పని చెప్పి బ్రోకర్లను తరిమారు. మరోవైపు తాము బ్రోకర్లం కాదని, వెంచర్ యాజమానులపై నిజానిజాలు తెలుసుకోకుండా ఇలా దాడులు చేయడం ఎంపీ ఈటల రాజేందర్ కు తగదని తర్వాత ఏకశిలా వెంచర్ కు చెందిన పలువురు మీడియా సమావేశం నిర్వహించారు.

# దావోస్‌లో మూడు మెగా ఒప్పందాలు

## రూ.11వేల కోట్ల పెట్టుబడులకు మేఘా రెడీ

**ప్రత్యక్షంగా వేయిమందికి ఉద్యోగాలు**

**బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధం**

**అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్ నెస్ రిసార్ట్**





**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ కంపెనీ మూడు కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్ ఏర్పాటుకు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) పై సంతకాలు చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో మేఘా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ కృష్ణారెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టుపై దాదాపు రూ.11 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. నిర్మాణ దశలో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత అదనంగా మరో 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అవసరమైన ఉద్యోగుల నియామకాలకు కంపెనీ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తుంది. ఈ చర్చల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 లక్ష్యసాధనలో పాలుపంచుకునేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు మేఘా కంపెనీ అధినేత ప్రకటించారు. దీంతో పాటు మేఘా కంపెనీ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు మరో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ అంతటా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ప్రాజెక్టును స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూపై సంతకాలు చేశాయి. రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రదేశాలలో 100 ఎంవీహెచ్ ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థను ఈ కంపెనీ అభివృద్ధి చేస్తుంది. దీనికి రూ.3000 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. దీంతో రెండేండ్లలో 1000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 3000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఇంధన నిల్వ, గ్రిడ్ స్థిరత్వం, పీక్ లోడ్ నిర్వహణలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుంది.

**పర్యాటకంలో..**

మేఘా కంపెనీ పర్యాటక రంగంలోనూ పెట్టుబడులకు ముందుకొచ్చింది. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్నెస్ రిసార్ట్ ఏర్పాటు కు చేసేందుకు మేఘా కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్కు చెందిన మౌలిక సదుపాయాల సంస్థ భాగస్వామ్యంతో ఈ రిసార్ట్ ను అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే దాదాపు రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.

# జనసేనకు గుడ్ న్యూస్

**ఢిల్లీ, మహా:** పవన్ కల్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం శుభవార్త చెప్పింది. జనసేనకు గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేస్తున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు ఈసీ లేఖ పంపింది. తాజా ప్రకటనతో, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీగా జనసేన అవతరించింది. ఇకపై గాజు గ్లాసు గార్తు జనసేనకు శాశ్వతంగా సొంతమైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రయిక్ రేట్ తో జనసేన పార్టీ రికార్డు సృష్టించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు ఎంపీ స్థానాల్లోనూ విజయభేరి మోగించింది. ఈ నేపథ్యంలో, ఈసీ రికగ్నైజ్డ్ పార్టీగా నిలిచిన జనసేన పార్టీ... గాజు గ్లాసు గుర్తును శాశ్వతంగా సొంతం చేసుకుంది.

## పరశురామ రాజు ఎంపిక పై కొత్తపల్లి గీత హర్షం



**విశాఖ ,మహా :** విశాఖ బీజేపీ నగర అధ్యక్షునిగా పరశురామరాజు ఎన్నిక పై రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు అరుకు మాజీ పార్లమెంట్ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు. పరశురామ రాజు వంటి సీనియర్ నాయకులను మహా విశాఖ నగరం బిజెపి అధ్యక్షుడు అధ్యక్షులుగా ఎంపిక కావడం వల్ల విశాఖ లో పార్టీ మరింత బలపడుతుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. పదవికి వన్నె తెచ్చే విధంగా రాజు కష్టపడతారని, పార్టీ అభివృద్ధి కోసం అంకిత భావంతో పని చేస్తారని గీత అన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టనం నిర్ణయం పట్ల గీత ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాక ఏపి రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా నియమితులైన జిల్లాల బిజెపి అధ్యక్షుల కు కొత్తపల్లి గీత శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

## పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ షురూ

### పర్యవేక్షించిన వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి



**కడప, మహా :** యోగివేమన విశ్వవిద్యాలయంలో 202425 విద్యా సంవత్సరానికి పీజీ ప్రవేశాల కౌన్సెలింగు మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ని ప్రవేశాల సంచాలకుల కార్యాలయ విభాగంలో మొదలైంది. వైవీయూ అడ్మీషన్ల డైరెక్టర్ డా. లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల అర్హతా పత్రాల పరిశీలన, విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరిగింది. ఈ కౌన్సెలింగునకు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కౌన్సెలింగు కేంద్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావులు సందర్శించారు. ఒక విద్యార్థినికి కౌన్సెలింగు ద్వారా సీటు కేటాయింపు పత్రాన్ని వారు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం2020 ప్రకారం నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్నవారికి లేటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పీజీ డిగ్రీకి తొలిసారిగా ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రవేశాల సంచాలకుల (డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్) డాక్టర్ లక్ష్మీ ప్రసా ద్ మాట్లాడుతూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, కామర్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, జువాలజి కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని తెలిపారు. విద్యార్థుల అర్హతా పత్రాల పరిశీలనలో సహ ఆచార్యులు డా. వి.రామకృష్ణ, డా. ఎన్. గణే ష్నాయక్, డా. మునికుమారి డీవోఏ విభాగ సిబ్బంది నాగమణి, జోసఫ్ పాల్గొన్నారు.



## వృద్ధురాలి యోగ క్షేమాలను తెలుసుకున్న సిపి

**వరంగల్, మహా;** వరంగల్ మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న గ్రామ సభకు హాజరైన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజల విజ్ఞప్తులు స్వీకరించారు. అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో ఎదురైన ఓ వృద్ధురాలి సిపి యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడంతో తనకు పింఛన్ రావడం లేదని సిపి ముందు వాపోవడంతో స్పందించిన సిపి సంబంధిత అధికారుల దృష్టికి వృద్ధురాలి సమస్యను తీసుక వెళ్ళారు. అందుకు ఆ వృద్ధురాలు ఆనందం వ్యక్తం చేసింది. కమిషనర్ వెంట వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ నాయక్, కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి, తదితరులు పాల్గొన్నారు.

## 25 టన్నుల గో మాంసం పట్టుకున్న నక్కపల్లి పోలీసులు

### అక్రమంగా గో మాంసం తరలిస్తున్న కంటైనర్ సీజ్..పోలీసుల అదుపులో కంటైనర్ డ్రైవర్

### గో మాంసంను పూడ్చివేసిన రెవిన్యూ, పోలీస్ సిబ్బంది






**అనకాపల్లిజిల్లా ,నక్కపల్లి ,మహా :** నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా వద్ద నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమార్ స్వామి వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా గో మాంసం తరలిస్తున్న కంటైనర్ పట్టుబడింది. ఈ సందర్భంగా నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమార్ స్వామి మీడియా తో మాట్లాడారు. వేంపాడు టోల్ ప్లాజా వద్ద పట్టుబడిన ఆ కంటైనర్ లో 23 వేల కేజీల గోమాంసం ఉందన్నారు. ఆ గోమాంసం ను ప్యాకింగ్ చేసి అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ సీజ్ చేయడం జరిగిందన్నారు. డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు .ఈ కంటైనర్ వెస్ట్ బెంగాల్ రాణిగంజ్ నుండి హైదరాబాద్ తరలిస్తున్నారని తెలిపారు. సీజ్ చేసిన కంటైనర్ లో ఉన్న గో మాంసం ను నక్కపల్లి తహసీల్దార్ పర్యవేక్షణలో వి.ఆర్.ఓ ల సమక్షంలో తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం లో జె.సి.బి తో గోతులు తీసి పాతిపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. గో అక్రమ రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆయన వెంట ఎస్.ఐ సన్నిబాబు రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## డాక్టర్ బందెల మోహన్ రావుకు ఘన సన్మానం




**వరంగల్, మహా;** రోటరీ క్లబ్ వరంగల్ శాఖ, స్థాపించి 70 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా క్లబ్ వారు ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న ఎక్సలెన్స్ అవార్డు కు వైద్య రంగం నుండి ప్రముఖ వైద్యులు డాక్టర్ బందెల మోహన్ రావు రిటైర్డ్ ఎంజీఎం..ఆర్ఎంఓ ను ఎంపిక చేసి వారు సాధించిన విజయాలు, అందించిన సేవలకు గుర్తింపుగా వారు ఎంచుకున్న మార్గం లో వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి నందుకుగాను, నిబద్ధతతో, అంకిత భావంతో కూడిన వారి వైద్య సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించి సర్టిఫికెట్ అఫ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రధానం చేశారు. కురవెల్ల రాజగోపాల్ అధ్యక్షు తనకుజరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధి వంగల రమేష్ విశిష్ట అతిధిగా డా : శరత్ బాబు ప్రముఖ నేత్ర వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన 80 కిలోల గంజాయి నిర్వీర్యం



### ఎస్పీ శబరీష్

**ములుగు,మహా :** జిల్లాలో 18కేసుల్లో పట్టుబడ్డ 80కిలోల 23గ్రాముల గంజాయిని దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సీజ్ చేసిన గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో హన్మకొండ జిల్లా సుబేదారిలోని కాకతీయ మెడికల్ సర్వీసెస్ సెంటర్ కు తరలించి దహనం చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచన మేరకు శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేశామన్నారు. యువత మాదక ద్రవ్యలకు దూరంగా ఉండాలని, జీవితాన్ని అంధకారంలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ యాంటి డ్రగ్ వారియర్ గా పని చేయాలని, ఎవరైనా మాదకద్రవ్యాలు ఉపయోగించినా, సరఫరా చేసినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ కిశోర్ కుమార్, సీసీఎస్ సిఐ రమేష్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, డీసీఆర్బీ ఎస్సై జగదీష్, ములుగు ఎస్సై లక్ష్మారెడ్డి, ఆర్ఎస్సై సంపత్ రావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పోలీసు శాఖలో 35ఏళ్లుగా హోంగార్డ్ గా విధులు నిర్వర్తించి పదవీవిరమణ పొందిన పత్తి నర్సంగరావు ను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ శాలువాతో సత్కరించారు.

## మెట్రో కెమ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

### భద్రాతా ప్రమాణాలు తీస్కోకపోవడమే కారణమంటున్న సి.ఐ. టి.యూ నాయకులు






**అనకాపల్లి జిల్లా ,పరవాడ ,మహా :** పరవాడ మండలంలోని జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ప్రమాదం మెట్రో కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మెట్రో కెమ్ పరిశ్రమ లో ఆస్తి నష్టం జరిగింది. ఏ ఫ్లాన్ ట్యాంకు ముట్టుకోవడంతో ఈ ప్రముఖ జరిగిందని సిబ్బంది చెబుతున్నారు. ఆ ప్రాంతంలో భారీగా మంటలు ఎగిసిపడతంతో సిబ్బంది దూరంగా పరుగులు తీశారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. పూర్తి వివరాల కోసం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత రెండు నెలల క్రితం కూడా ఈ మెట్రో కెమ్ పరిశ్రమలో ప్రమాదం జరిగిందని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ,పొల్యూషన్ ,సేఫ్టీ అధికారులు పట్టించుకోక పోవడమే కారణమని సి.ఐ. టి.యూ నాయకులు చెబుతున్నారు. ఇక నైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశ్రమ పైనా ,పరిశ్రమ యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రజల సంక్షేమం కొరకే ప్రజా పాలన

- గ్రామ వార్డు సభలలో సమస్యలు పరిష్కారం
- సొంత ఇంటి జాగా కలిగిన వారికి ప్రాధాన్యత
- జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు
- స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





**ఇబ్రహీంపట్నం, జనవరి 21 మహా:** నియోజకవర్గ పరిధిలోని ఆదిభట్ల మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన వార్డు సభకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో ఆదిభట్ల 21నుండి 24 వరకు జరిగే ప్రజాపాలన వార్డు సభలలో ప్రజల సమస్యలకు పరిష్కారం అందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి, ఆర్డిఓ అనంతరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి సభకు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలోని ప్రజలకు కనీస సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజల శ్రేయస్సు కోరుతుందని కొనియాడారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసి తీరుతామని తెలిపారు. ప్రజా పాలన వార్డు సభలలో ప్రజలకు కావలసిన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి కార్యక్రమాలు ఈనెల 26 నుండి ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 500 కే గ్యాస్ సిలిండర్ 2 యూనిట్ల కరెంటు ఉచితంగా అందించడం జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా సొంత ఇంటి జాగా కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మొదటగా దివ్యాంగులకు, వితంతు మహిళలకు, పారిశుద్ధ్య కార్మికులకు, భూమిలేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లను అందించడం జరుగుతుందని అన్నారు. రైతులకు రైతు భరోసా అందించడం జరుగుతుందని, సాగు చేయడానికి యోగ్యమైన భూమి కలిగి ఉంటే, ప్రతి ఎకరానికి రైతు భరోసా అందించడం జరుగుతుందని అన్నారు. సాగుకు పనికిరాని గుట్టలకు, కొండలకు, వెంచర్లకు రోడ్లకు రైతు భరోసా అందించడం జరగదని తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో 7 లక్షల కోట్ల అప్పు భారాణి రాష్ట్ర ప్రజలపై మోపిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారని దుయ్యబట్టారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడికి కూడా డబల్ బెడ్ రూమ్ ఇయ్యలేని దౌర్భాగ్యస్థితిలో గత ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెప్పి వంచించి నమ్మబలికారని అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం చెర్లపటేల్ గూడ గ్రామంలో ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటు అయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వం, ప్రజల కోసం, ప్రజల ఆశల కోసం, పేద ప్రజల స్థితిగతులను మార్చే ప్రభుత్వం అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పలాలు అందే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసి శేఖర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్ గౌడ్, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, మున్సిపాలిటీ ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్, మహా:** మోసపూరిత వాగ్దాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. ప్రజల సోమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు. ఇందులో భాగంగానే మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలతో పాటు పిరమిడ్ లాంటి స్కీంల ద్వారా ప్రజల నుండి డబ్బును దోచేస్తున్నారు. ఈ స్కీంల ప్రధాన లక్ష్యం విలాసవంతమైన వస్తువులు అందజేస్తామని, సొంత ఇంటి కలను నేరవేరుస్తామని, విదేశీ యాత్రలకు పంపిస్తామని మోసపూరితమైన వాగ్దానాలతో ఈ స్కీంలను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు మొదటగా కొంత రుసుముతో ప్రాధమిక సభ్యత్వాన్ని కల్పించడం జరిగింది. సభ్యత్వం పొందిన వారితో మరికొంత మంది వ్యక్తులను సభ్యత్వం కల్పిచే ఎక్కువ మొత్తం పెట్టిన పెట్టుబడికి రెట్టింపు వస్తుందని, ఎక్కువ మొత్తంలో సభ్యులను సభ్యులుగా చేర్పిస్తే పెద్ద మొత్తంగా డబ్బు వస్తుందని ప్రజలను మభ్యపెడుతూ కోట్లల్లో డబ్బు కొల్లగొట్టడం ఈ మల్టీ లెవెల్ స్కీంల ప్రధాన లక్ష్యమని ప్రజలు ముందుగా ఇది గుర్తించాలి. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ళు ప్రజల ఆత్యాశను తమ అయుధాలు మార్చుకొని సామాజిక మాద్యమాలు, మెయిల్స్ ద్వారా, ఇతర ప్రచార సాధనాల ద్వారా ప్రజల బలహీనతలను లక్ష్యంగా చేసుకొని ప్రజల దృష్టిని ఆకర్షించే రీతిలో ప్రకటనల పట్ల ప్రజలు మోసపోవద్దని.




## లింగంపల్లిలో ప్రజాపాలన సభ విజయవంతం

### జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డు

**మంచాల జనవరి 21 మహా:** ప్రజా పాలనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించడం జరిగింది. మంగళవారం మంచాల మండలం, లింగంపల్లి గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీల పథకాల అమలులో నాలుగు పథకాలు అమలు పరిచే కార్యక్రమంలో లింగంపల్లి గ్రామంలో గ్రామ సభ అధికారులు నిర్వహించారు. జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే పథకాలు ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు పథకాల అమలు గురించి ప్రజలకు వివరించడం జరిగింది. గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సభను గ్రామ ప్రజల సమక్షంలో విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వహించుకోవడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మనబోల్ భరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ పేర్క మూర్తి, బత్తుల సుదర్శన్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, రాచకొండ సురేష్, మైలారం ఈశ్వర్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా బిజెపి అధ్యక్షుడుగా పరశురామరాజు

### ఎన్నికల పరిశీలకుని గా ..వ్యవహరించిన పూడి తిరుపతి రావు




**విశాఖ ,మహా :** విశాఖ జిల్లా బిజెపి అధ్యక్షుడుగా పరశురామరాజు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుని గా వ్యవహరించిన పూడి తిరుపతి రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ చాలా కీలకమైందని అన్నారు.బిజెపి పార్టీ కి దక్షిణ భారత దేశంలో కీలక పట్టు కొమ్మగా నిలిచిందన్నారు.ప్రతి మూడేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహిస్తాం అని ప్రకటించారు ఈరోజు విశాఖ కు పరశురామరాజు ని నూతన అధ్యక్షుని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.బిజెపిలో పదవులు ఉండవు బాధ్యతలు ఉంటాయన్నారు.ప్రజా స్వామ్య పద్ధతి లోఈ ఎన్నికలు జరిగాయని తెలిపారు. ప్రజా సమస్యలు మీద ముందుకు వెళ్ళాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోఉందని గుర్తు చేశారు.విశాఖ ఉత్తర నియోజకవర్గం లో విష్ణు కుమార్ రాజు శాసన సభ్యులుగా ఉన్నారన్నారు. విశాఖ పార్లిమెంట్ జిల్లా అధ్యక్షులు పరిధిలో ఆరు నియోజక వర్గాలు సమన్వయం చేసుకుంటారని చెప్పారు.బిజెపి పార్టీ కి రాష్ట్రంలో ఏకైక స్థలం విశాఖ లోనే ఉందన్నారు.పూర్వపు అధ్యక్షులు రవీంద్ర రెడ్డి కూడా ఐదేళ్లు పార్టీ కోసం పూర్తి సమయం ఇచ్చి పని చేశారని చెప్పారు. పదవి బాధ్యతల స్వీకరణ వేడుక కు ముఖ్య అతిధిలుగా విశాఖ ఉత్తర నియోజక వర్గ శాసన సభ్యులు పి విష్ణు కుమార్ రాజు.సెయిల్ డైరెక్టర్ సాగి విశ్వనాథ్రాజులు హాజరయ్యారు. అంతకు ముందు ముఖ్య అతిథిలుగా హాజరైన విష్ణుకుమార్ రాజు ,సాగి విశ్వనాథ రాజులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. పార్టీ చేసే సేవలను కొనియాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో బి.జె.పి ముఖ్య నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక 07
బుధవారం, హైదరాబాద్ | 22-01-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM



## నేవీ ముంబై ఎయిర్‌పోర్ట్ అనుసంధానానికి ముంబై చుట్టూ వాటర్ టాక్సీలు

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

దేశ ఆర్థిక రాజధాని ముంబై సబర్బన్ పరిధిలో సుమారు పదివేల వాటర్ టాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో అందుబాటులోకి రానున్న నేవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానిస్తూ ముంబై సబర్బన్ ప్రాంతాల నుంచి ఈ వాటర్ టాక్సీలు నడిపే ప్రతిపాదనను కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకొచ్చారు. ఈ విషయమై పడవల యజమానులతో చర్చించానని తెలిపారు. మంగళవారం ముంబైలో జరిగిన ఐసీఈఆర్పీ 2025 ఎగ్జిబిషన్‌లో గడర్కీ మాట్లాడుతూ నగర సబర్బన్ ప్రాంతాల నుంచి నేవీ ముంబై విమానాశ్రయానికి వాటర్ టాక్సీలు నడిపే అంశాన్ని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించానని చెప్పారు. ముంబై నగరానికి ఉత్తరాన అరేబియా సముద్ర తీరాన గల విరార్, ఈశాన్య ప్రాంతంలోని ఠాణె క్రీక్ నుంచి విమాన ప్రయాణికులు నేవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి వాటర్ టాక్సీల్లో 70 నిమిషాల్లో చేరుకుంటారన్నారు. వాసాయివిరార్, కల్యాణ్‌డోంబివాలీ ప్రాంతాల నుంచి నూతన విమానాశ్రయానికి 70 నిమిషాల్లో చేరుకోవచ్చన్నారు. ఇందుకు పది వేల టాక్సీలు అవసరం అవుతాయన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి నేవీ ముంబై విమానాశ్రయ సేవలు ప్రారంభం అవుతాయి.

## వచ్చేనెల 7న అదానీ చిన్న కొడుకు జీత్ వివాహం

### పెండ్లి కూతురు ఎవరో తెలుసా..?!

భారతీయ కుబేరుడు గౌతం అదానీ చిన్న కొడుకు జీత్ ఓ ఇంటివాడు కానున్నాడు. ఆయన వివాహం వచ్చేనెలలో నిరాడంబరంగా, సంప్రదాయంగా జరుగనున్నది. రాజకీయ, సినీ, కార్పొరేట్ ప్రముఖుల హడావుడి లేకుండా జరుగనున్నది. ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళాలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో వచ్చిన గౌతం అదానీ ఈ సంగతి చెప్పారు. వచ్చే నెల ఏడో తేదీన తన కొడుకు జీత్ పెండ్లి జరుగుతుందన్నారు. సూరత్ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కూతురు దివాషాతో జీత్ వివాహం చాలా సింపుల్‌గా, సంప్రదాయ బద్ధంగా జరుగుతుందన్నారు. ఇటీవల మరో భారత్ బిలియనీర్ ముకేశ్ అంబానీ చిన్న కొడుకు అనంత్ అంబానీ పెండ్లికి దేశ దేశాల ప్రముఖులు హాజరైన సంగతి తెలిసిందే. 2023 మార్చిలో జీత్ అదానీ, దివా షా నిశ్చితార్థం అహ్మదాబాద్‌లో జరిగింది. జీత్ - దివా షా వివాహానికి అతిథులు 58 దేశాల నుంచి వస్తారని, వారు వెయ్యి సూపర్ కార్లు, వందలాది ప్రైవేట్ జెట్ విమానాల్లో వివాహ వేదిక అహ్మదాబాద్‌కు వస్తారని భావిస్తున్నారు. తాము మహా కుంభ్ మేళా సెలబ్రిటీలం కాబోమని ఓ ప్రశ్నకు సమాధానంగా గౌతం అదానీ చెప్పారు. గౌతం అదానీతోపాటు జీత్ అదానీ, గౌతం అదానీ పెద్ద కొడుకు కరణ్ అదానీ పారిధి, మనుమరాలు కావేరి తదితరులు ఉన్నారు.

## భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో హీరో ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్.. రూ.1.80 లక్షలకే లభ్యం..!

ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో మోటో కార్ప్ తన హీరో ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ మోటారుసైకిల్‌ను భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025లో ఆవిష్కరించింది. ఈ మోటారు సైకిల్ ధర రూ.1.80లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. దేశవ్యాప్తంగా అన్ని డీలర్‌షాప్‌ల వద్ద అందుబాటులో ఉంటుంది. ఫిబ్రవరి నుంచి హీరో ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ మోటార్ సైకిల్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభం అవుతాయని హీరో మోటో కార్ప్ తన సోషల్ మీడియా వేదికలపై పోస్ట్ చేసింది. మార్చి నుంచి మోటార్ సైకిళ్ల డెలివరీ ప్రారంభం అవుతుంది. హీరో ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ మోటారు సైకిళ్లు మూడు రంగుల్లో లభిస్తాయి. ఈఐసీఎంఏ-2023 (EICMA 2023)లో ఆవిష్కరించిన ఎక్స్‌టంట్ 2.5 (Xtunt 2.5 R) కాన్సెప్ట్ ఆధారంగా హీరో ఎక్స్‌ట్రీమ్ 250ఆర్ (Hero Xtreme 250 R) మోటారు సైకిల్ రూపుదిద్దుకున్నది. స్కల్‌ప్టెడ్ ఫ్యుయల్ ట్యాంక్, అగ్రెసివ్ హెడ్ యూనిట్, అన్ స్వెప్ట్ టెయిల్ సెక్షన్ డిజైన్‌తో వస్తోందీ మోటారు సైకిల్. కొత్తగా అభివృద్ధి చేసిన ఇంజిన్‌తో విస్తృత శ్రేణి వసతులు అందుబాటులో ఉన్నాయి. హీరో ఎక్స్‌ట్రీమ్ 250ఆర్ (Hero Xtreme 250 R) మోటారు సైకిల్ ఆటో ఇల్యూమినేషన్ క్లాస్ డీ ఎల్ఈడీ ప్రాజెక్టర్ హెడ్ ల్యాంప్స్ విత్ డీఆర్ఎల్స్, స్ప్లిట్ సీట్ కాన్ఫిగరేషన్, స్విచ్ఛబుల్ ఏబీఎస్, లాప్ టైమర్, డ్రాగ్ టైమర్, మీడియా కంట్రోల్‌తోపాటు టర్న్ బై టర్న్ నేవిగేషన్‌ను అనుమతిస్తూ బ్లూటూత్ కనెక్టివిటీ మద్దతుతో ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, ఫీచర్లు జత చేశారు. ఫ్రంట్‌లో 43ఎంఎం యూఎస్డీ ఫోర్క్స్, రేర్ మోనోషాక్ యూనిట్ విత్ సిక్స్ స్టెప్ అడ్జస్టబుల్ ప్రీలోడ్, రేర్‌లో రాడికల్ టైర్‌తోపాటు 17 అంగుళాల అల్లాయ్ వీల్స్ విత్ ట్యూబ్ లెస్ టైర్స్, డ్యుయల్ చానెల్ ఏబీఎస్ హ్యాండిల్ బ్రేకింగ్ డ్యూటీస్‌తోపాటు డిస్క్ బ్రేక్స్ ఉన్నాయి. హీరో ఎక్స్‌ట్రీమ్ 250ఆర్ మోటారు సైకిల్ ఆల్ న్యూ 250సీసీ డీవోహెచ్‌సీ, ఫోర్ వాల్వ్, సింగిల్ సిలిండర్ విత్ సిక్స్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్,కరిజ్మా ఎక్స్ఎంఆర్ 250లో మాదిరిగా లిక్విడ్ కూల్డ్ యూనిట్ ఉంటుంది. ఈ మోటారు సైకిల్ ఇంజిన్ గరిష్టంగా 9250 ఆర్పీఎం వద్ద 29.5 బీహెచ్‌పీ విద్యుత్, 7250 ఆర్పీఎం వద్ద 25 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. కేవలం 3.25 సెకన్లలో గంటకు 60 కి.మీ వేగంతో దూసుకెళ్తుంది.




## హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ కొత్త డెలివరీ సెంటర్ ప్రారంభం..!





ప్రముఖ ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్) హైదరాబాద్‌లోని తన గ్లోబల్ డెలివరీ ఫుట్ ప్రింట్)ను విస్తరిస్తున్నట్లు తెలిపింది. హైటెక్ సిటీలో 5000 మంది ఉద్యోగులు పని చేయగల సామర్థ్యం గల కొత్త సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. హైటెక్, లైఫ్ సైన్సెస్, ఫైనాన్సియల్ సర్వీసెస్‌కతీతంగా ప్రపంచవ్యాప్తంగా పలు పారిశ్రామిక క్లయింట్లకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌పర్మేషన్ సొల్యూషన్స్, క్లౌడ్ సొల్యూషన్స్ అందించడానికి ఈ కొత్త సెంటర్ ఉపకరిస్తుంది. హైటెక్ సిటీలో 3.20లక్షల ఎస్ఎఫ్టీ విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ న్యూ సెంటర్ ప్రారంభించింది. సుస్థిర వ్యాపార పద్ధతులకు కట్టుబడి సేవలందిస్తున్నట్లు తెలిపింది. 'అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు, అత్యంత నాణ్యతతో కూడిన ప్రతిభావంతులకు వేదిక హైదరాబాద్. లోకల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌కు అనుగుణంగా గ్లోబల్ క్లయింట్ బేస్‌కు సేవలందు అందుబాటులోకి తెస్తుందీ న్యూ సెంటర్' అని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ కం మేనేజింగ్ డైరెక్టర్ సీ విజయ్ కుమార్ తెలిపారు. 2007 నుంచి హెచ్‌సీఎల్ టెక్నాలజీ హైదరాబాద్‌లో సేవలందిస్తున్నది. కొత్త సెంటర్‌తోపాటు 8,500 మంది కూర్చుని పని చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), ఉస్మానియా యూనివర్సిటీల నుంచి వచ్చే ప్రతిభావంతులను నియమించుకుంటూ ఐటీ సేవలందిస్తోంది హెచ్‌సీఎల్ టెక్నాలజీస్.

## స్వల్పంగా పెరిగిన బంగారం.. ఫ్లాట్‌గా ముగిసిన వెండి..!



దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర స్వల్పంగా రూ.100 వృద్ధి చెంది రూ.82,100లకు పెరిగింది. ఆభరణాల తయారీలో వినియోగించే 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.100 వృద్ధితో రూ.81,700లకు చేరుకుంది. సోమవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.82,000, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.81,600 వద్ద స్థిర పడింది. మంగళవారం కిలో వెండి ధర ఫ్లాట్‌గా రూ.93,000 వద్ద కొనసాగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ తులం బంగారం ధర రూ.426 వృద్ధితో రూ.78,970లకు చేరుకుంది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది స్పందిస్తూ 'ఎంసీఎక్స్‌లో తులం బంగారం ధర లాభ పడి రూ.79 వేలకు చేరుకుంది. మెక్సికో, కెనడాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచుతామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఎంసీఎక్స్‌లో బంగారం ధర పెరిగింది' అని వ్యాఖ్యానించారు. కిలో వెండి మార్చి డెలివరీ ధర రూ.188 (0.21 శాతం) పెరిగి రూ.91,630లకు చేరుకుంది. గ్లోబల్ మార్కెట్లలో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 18.20 డాలర్లు (0.66 శాతం) పెరిగి 2,730.50 అమెరికా డాలర్లకు చేరుకుంది. బులియన్ మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం మంగళవారం ట్రేడింగ్‌లో గతేడాది నవంబర్ ఆరో తేదీన జీవిత కాల గరిష్టాన్ని తాకి ప్రస్తుతం 2,725 డాలర్ల వద్ద నిలిచింది. తాజాగా సుంకాలు పెంచుతామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన అంతర్జాతీయంగా ట్రేడ్ వార్‌కు దారి తీస్తుందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



## మహాకుంభమేళాలో పూసలమ్ముకునే అమ్మాయికి బాలీవుడ్ బంపరాఫర్!


మహాకుంభమేళాలో ఒక యువతి సంచలనంగా మారింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఆమె గురించే మాట్లాడుకుంటున్నారు.. సోషల్‌మీడియాలోనూ ఆమెపైనే చర్చలు.. అలా అని ఆమె ఏదో సెలబ్రిటీయో.. ధనవంతుల బిడ్డనో కాదు.. అందాల అప్సరస అంతకంటే కాదు.. చూడ్డానికి ఛామనఛాయ రంగులో ఉండే అత్యంత సాధారణ అమ్మాయి. పూసల దండలు అమ్ముకుని పొట్టబోసుకోవడమే ఆమె వృత్తి. అయినప్పటికీ ఆమె మహాకుంభమేళాలో స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. ఇందుకు కారణం కాటుక దిద్దిన అందమైన తేనే కళ్ళు.. అమాయకమైన చూపులు.. అవే ఇప్పుడు ఆమెను సోషల్‌మీడియా క్వీన్‌ను చేసింది. అంతేకాదు ఆ క్రేజ్‌నే ఇప్పుడు ఆమెకు బాలీవుడ్ నుంచి సినిమా ఆఫర్‌ను కూడా తీసుకొచ్చింది.

మహాకుంభమేళాలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిన ఆ అమ్మాయి పేరు మోనాలిసా భోస్లే. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వీరి కుటుంబం తరాలుగా పూసల దండలు అమ్ముకుని జీవనం సాగిస్తోంది. తల్లిదండ్రులకు సాయంగా మోనాలిసా కూడా చిన్నతనం నుంచే పూసల దండలు అమ్ముతున్నది. ఈ క్రమంలోనే మహా కుంభమేళా సందర్భంగా పూసల దండలు అమ్ముకోవడానికి ప్రయాగ్‌రాజ్‌కు వచ్చింది. అక్కడే మోనాలిసా అమాయకపు మొహం, కాటుక దిద్దిన తేనె కాళ్లు చూసి కొంతమందికి ముచ్చటేసింది. దీంతో ఆమె ఫొటోలు, వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో ఆమె గురించి అందరికీ తెలిసింది. ఆ ఫొటోలు చూసిన వారు కూడా మోనాలిసా అందానికి ఫిదా అయ్యారు. మోనాలిసాతో సెల్ఫీలు దిగేందుకు, ఆమెను ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఫొటోగ్రాఫర్లు, వ్లాగర్లు ఎగబడుతున్నారు. ఆమె అందాన్ని పొగిడేస్తూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలా మొత్తమ్మీద మోనాలిసా ఇప్పుడు సెన్సేషన్‌గా మారడంతో బాలీవుడ్ నుంచి కూడా ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ సనోజ్ మిశ్రా తన సినిమాలో మోనాలిసాకు ఛాన్స్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మోనాలిసా రూపం, ఆమె అమాయకత్వాన్ని చూసి ఫిదా అయ్యానని సనోజ్ మిశ్రా తెలిపారు. డైరీ ఆఫ్ మణిపూర్ చిత్రంలో ఆమెకు ఛాన్స్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ఇలాంటి అమ్మాయినే వెతుకుతున్నానని.. తన సినిమాలో రైతు కూతురి పాత్రలో నటించేందుకు మోనాలిసా సరిగ్గా సెట్ అవుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తొందరలోనే ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి మోనాలిసాను కలుస్తానని చెప్పారు. ఆమెకు యాక్టింగ్ నేర్పించి మరి తన సినిమాలోకి తీసుకుంటానని స్పష్టం చేశారు.

## అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీలో ఆప్‌కు గట్టి షాక్..!

అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం ఆప్‌కు చెందిన నలుగురు నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో ఇద్దరు కౌన్సిలర్‌లు రేఖా రాణి, శిల్పా కౌర్ ఉన్నారు. రేఖా రాణి భజన్‌పుర నుంచి, శిల్పా కౌర్ ఖ్యాలా నుంచి ఆప్ కౌన్సిలర్‌లుగా ఎంపికయ్యారు. మిగతా ఇద్దరిలో ఆప్ మాజీ ఎమ్మెల్యే శ్రీదత్ శర్మ, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు పార్లమెంటరీ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న ఛౌదరి విజేంద్ర ఉన్నారు. శ్రీదత్ శర్మ 2015 నుంచి 2020 వరకు ఢిల్లీలోని ఘోండా అసెంబ్లీ స్థానానికి ప్రాతినిథ్యం వహించారు. వీరంతా బీజేపీ నేతలు హర్ష్ మల్హోత్రా, మనోజ్ తివారీ, కమల్‌జీత్ సెహ్రావత్ సమక్షంలో ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష బీజేపీతోపాటు కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా పోటీపడుతున్నాయి. దాంతో అక్కడ త్రిముఖ పోటీ నెలకొన్నది. అయితే కాంగ్రెస్ పార్టీకి గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడం గమనార్హం.






## టర్కీ అగ్నిప్రమాదం..

### 66కు పెరిగిన మృతుల సంఖ్య

టర్కీ (Turkey) లోని స్కీ రిసార్టు (Ski resort) హోటల్ అగ్నిప్రమాదం (Hotel Fire) లో మృతుల సంఖ్య 66కు పెరిగింది. క్షతగాత్రుల సంఖ్య 51కి చేరింది. బోలో ప్రావిన్స్‌లోని గ్రాండ్ కర్తాల్ హోటల్‌లో ఈ ప్రమాదం జరిగింది. 12 అంతస్తులు ఉన్న ఆ హోటల్‌లో తెల్లవారుజామున 3.30 గంటలకు అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో హోటల్లో కస్టమర్లు కొందరు బెడ్ షీట్లు, బ్లాంకెట్ల సాయంతో రూమ్‌ల నుంచి కిందకు వచ్చే ప్రయత్నంచేశారు. ప్రమాదం జరిగినప్పుడు 234 మంది గెస్టులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అందరూ నిద్రలో ఉన్నప్పుడు నిప్పు అంటుకున్నదని, వెంటనే బయటకు పరుగులు తీశామని ఓ స్కీయింగ్ ఇన్‌స్ట్రక్టర్ తెలిపారు. హోటల్ గదుల్లో పొగ కమ్ముకుపోవడంతో గెస్టులు ఫైర్ ఎస్కేప్‌ను గుర్తించడం కష్టంగా మారిందన్నారు.హోటల్‌కు చెందిన రూఫ్‌తోపాటు టాప్ ఫ్లోర్లు కూడా అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. గ్రాండ్ కర్తాల్ హోటల్‌లో మొత్తం 161 రూమ్‌లు ఉన్నాయి. దేశ రాజధాని ఇస్తాంబుల్‌కు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొరొగ్లు పర్వతాల్లో స్కీ రిసార్టు ఉన్నది. కాగా స్కూళ్లకు సెమిస్టర్ సెలువులు ఇవ్వడంతో రిసార్టులన్నీ పూర్తిగా గెస్టులతో నిండిపోయాయి. ప్రమాదం జరిగిన హోటల్ వద్దకు 30 ఫైర్ ట్రక్కులు, 28 అంబులెన్సులను పంపారు.

## జమిలీ ఎన్నికలపై ఈ నెల 31న జేపీసీ రెండో సమావేశం..



ఒకే దేశంఒకే ఎన్నిక ప్రతిపాదనలకు సంబంధించిన బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (JPC) రెండో సమావేశం ఈ నెల 31న జరుగనున్నది. ఈ మేరకు లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో సమావేశం వివరాలు పబ్లిష్‌అయ్యాయి. రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లులను గత శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ లో ప్రవేశపెట్టారు. బిల్లులను పరిశీలించాలని కమిటీకి సూచించారు. జేపీసీ తొలి సమావేశం ఈ నెల 8న జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రతిపాదిత చట్టాల నిబంధనలను కమిటీకి న్యాయ మంత్రిత్వశాఖ ప్రతినిధులు, అధికారులు వివరించారు. సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు చట్టాల సవరణను రాజ్యాంగం, సమాఖ్యవాదం ప్రాథమిక స్ఫూర్తిపై దాడిగా అభివర్ణించారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. 39 మంది సభ్యుల కమిటీలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ, జనతాదళ్ (యూ)కు చెందిన సంజయ్ ఝా, శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి సంజయ్ సింగ్, కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలే (టీఎంసీ) ఉన్నారు. జమిలీ ఎన్నికలకు సంబంధించిన రెండు ముసాయిదా బిల్లులను పరిశీలించేందుకు రాజకీయ పార్టీలు సుముఖత వ్యక్తం చేయడంతో కమిటీ సభ్యుల సంఖ్యను కేంద్రం 39కి పెంచింది. కమిటీలో మాజీ కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, పర్షోత్తమ్ రూపాలా, మనీష్ తివారీ, ఎంపీలు అనిల్ బలూని, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రా ఉన్నారు. కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట హాజరైన వేణుస్వామి



ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట హాజరయ్యారు. గతంలో నటీనటుల వ్యక్తిగత జీవితాలపై వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నానంటూ.. క్షమాపణలు చెప్పారు. నాగచైతన్య - శోభిత జంట పెళ్లి సమయంలో వేణుస్వామి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులను సవాల్ చేస్తూ వేణుస్వామి హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. దాంతో వేణుస్వామి మహిళా కమిషన్ కార్యాలయానికి వచ్చి క్షమాపణలు చెప్పారు. నాగచైతన్య, శోభిత పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఈ జంట ఎక్కువ కాలం కలిసి ఉండరని, విడాకులు తీసుకుంటారని జోష్యం చెప్పారు వేణుస్వామి. వేణుస్వామి వ్యాఖ్యలపై ఫిలిం జర్నలిస్ట్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కమిషన్ ఎదుట హాజరైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని కమిషన్ హెచ్చరించింది.

# బుచ్చిబాబు టీం మూడో షెడ్యూల్ ఇదే..!




టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ ఇటీవలే గేమ్ ఛేంజర్‌తో ప్రేక్షకుల ముందుకు రాగా మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. రాంచరణ్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఉప్పెన ఫేం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో చేస్తున్న ఆర్‌సీ 16. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. గతేడాది నవంబర్‌లో మైసూరులోని ఛాముండేశ్వరి మాత ఆశీస్సులతో సినిమా షూటింగ్‌ను మొదలుపెడుతున్నట్టు తెలియజేస్తూ డైరెక్టర్ బుచ్చి బాబు ఫొటో కూడా షేర్ చేసుకున్నాడు. ఈ షెడ్యూల్‌లో శ్రీరంగపట్టణ బెల్లం ఫ్యాక్టరీ, మైసూరుకు సమీపంలోని మేల్కొటే టెంపుల్‌లో వచ్చే సన్నివేశాలు చిత్రీకరించినట్టు సమాచారం. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. రాంచరణ్ త్వరలోనే మూడో షెడ్యూల్‌లో జాయిన్ కాబోతున్నాడట. తాజా సమాచారం ప్రకారం జనవరి 27 నుంచి హైదరాబాద్‌లో ఈ షెడ్యూల్ మొదలు కానుంది. జులైకల్లా షూటింగ్ పూర్తి చేసి.. దసరా లేదా డిసెంబర్ మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు రెడీ అవుతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఆర్‌సీ 16 కథ కేవలం ఒక్క క్రీడ చుట్టే కాకుండా... మల్టిపుల్ స్పోర్ట్స్ గురించి తెలియజేసేలా ఉండబోతుందని ఫిలింనగర్ సర్కిల్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇదే నిజమైతే రాంచరణ్ అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. ఈ చిత్రానికి తంగలాన్ ఫేం ఏగన్ ఏకాంబరం కాస్ట్యూమ్ డిజైనర్ పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. ఈ మూవీని సుకుమార్ రైటింగ్స్‌మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు.

# ఆసుపత్రి నుంచి సైఫ్ అలీ ఖాన్ డిశ్చార్జ్




బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గత వారం సైఫ్ ఇంటికి చోరీకి వచ్చిన దుండగుడు నటుడిపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి అనంతరం తీవ్ర గాయాలతో లీలావతి ఆసుపత్రిలో చేరారు. అక్కడ ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరు రోజుల చికిత్స అనంతరం ఇవాళ డిశ్చార్జ్ అయ్యారు. వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని సైఫ్‌కు వైద్యులు సూచించారు. అదేవిధంగా ఇన్ఫెక్షన్ అవ్వకుండా ఉండేందుకు ఎక్కువమంది ఆయన వద్దకు రాకుండా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈనెల 16న సైఫ్ ఇంటికి చోరీకి వెళ్లిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరుసార్లు సైఫ్‌ను దుండగుడు కత్తితో పొడిచాడు. గురువారం తెల్లవారుజామున 2:30 ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నటుడికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. మరోవైపు సైఫ్‌పై దాడి కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను శనివారం అర్ధరాత్రి 2.50గంటలకు థానేలోని హిరానందని ప్రాంతంలో అరెస్టు చేసి విచారిస్తున్నారు. విచారణలో భాగంగా క్రైమ్‌సీన్ రీక్రియేషన్ కోసం నిందితుడిని సైఫ్ ఇంటి వద్దకు తీసుకెళ్లారు. నిందితుడి వేలిముద్రలను కూడా తీసుకున్నారు.

## పెళ్లి పీటలెక్కిన స్టార్ డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు.. ఇంతకీ అమ్మాయి ఎవరో తెలుసా..?



డిమోంటే కాలనీ సినిమా తెరకెక్కించి ఎంట్రీతోనే డైరెక్టర్‌గా మంచి హిట్టందుకున్నాడు కోలీవుడ్ దర్శకుడు ఆర్ అజయ్ జ్ఞానముత్తు. డిఫరెంట్ స్టోరీలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ టాలెంటెడ్ డైరెక్టర్ వ్యక్తిగత జీవితంలో కీలక ముందడుగు వేశాడు. అజయ్ జ్ఞానముత్తు బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పేశాడు. తన ప్రియురాలు షిమోనాను పెళ్లి చేసుకున్నాడు అజయ్ జ్ఞానముత్తు. జనవరి 19న చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో అజయ్ జ్ఞానముత్తుషిమోనా వివాహబంధంతో ఒక్కటయ్యారు. కొత్త జీవితంలో అడుగుపెడుతున్న వధూవరులకు కోలీవుడ్ స్టార్ యాక్టర్ విక్రమ్ శుభాకాంక్షలు తెలియజేశాడు. యాక్టర్లు ఆనంద్ రాజ్, మృణాళిని రవి, మీనాక్షి గోవిందరాజన్, నిర్మాతలు కేఈ జ్ఞాన్‌వేల్ రాజా, రాజశేఖర్ పాండ్యన్ వధూవరులను ఆశీర్వదించారు. 2015లో హార్రర్ జోనర్‌లో విడుదలైన డిమోంటే కాలనీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ఆ తర్వాత విక్రమ్‌తో కోబ్రా సినిమా తెరకెక్కించాడు. అజయ్ జ్ఞానముత్తు డైరెక్షన్‌లో డిమోంటే కాలనీ 2 కూడా వచ్చింది.

## చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించిన ప్రియాంక



ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం చిలుకూరు బాలాజీ టెంపుల్‌ను ఆమె సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రియాంక చోప్రాకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. సంబంధిత ఫొటోలను ప్రియాంక ఇన్ స్టాలో షేర్ చేశారు. బాలాజీ ఆశీస్సులతో కొత్త జర్నీ మొదలు పెడుతున్నట్టు ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "శ్రీ బాలాజీ ఆశీస్సులతో ఒక కొత్త అధ్యాయం మొదలవుతుంది. మనమందరం మన హృదయాలలో శాంతి, శ్రేయస్సు, సమృద్ధిని పొందుదాం. దేవుడి దయ అనంతం. ఓం నమః నారాయణ" అని ఆమె పోస్టులో రాసుకొచ్చారు. చివర్లో రామ్ చరణ్ సతీమణి ఉపాసనకు ధన్యవాదాలు తెలిపారు. దీన్ని బట్టి ఉపాసన ఆమెకు దర్శన ఏర్పాట్లు చేసినట్లు అర్థం చేసుకోవచ్చు. పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని తెలిసిందే. ఈ భామ రీఎంట్రీకి రెడీ అయినట్టు ఇప్పటికే వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ బ్యూటీ ఫైనల్‌గా ఎస్ఎస్ఎంబీ 29తో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై మెరిసేందుకు రెడీ అవుతుందని బీటౌన్ సర్కిల్ టాక్.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## వుమెన్స్ U19 వరల్డ్ కప్‌లో సంచలనం.. హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించిన వైష్ణవి శర్మ..!



వుమెన్స్ అండర్19 ప్రపంచకప్‌లో టీమిండియా బౌలర్ వైష్ణవి శర్మ చరిత్ర సృష్టించింది. మలేషియాతో జరిగిన గ్రూప్‌ఏ మ్యాచ్‌లు వైష్ణవి అత్యద్భుతంగా బౌలింగ్ చేసింది. నాలుగు ఓవర్లు వేసిన వైష్ణవి ఐదు పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టింది. ఓ మెయిడెన్ ఓవర్ ఉండడం విశేషం. మ్యాచ్ 14వ ఓవర్లలో వరుసగా మూడు వికెట్ల పడగొట్టి హ్యాట్రిక్ నమోదు చేసింది. 14వ ఓవర్‌లో వైష్ణవి రెండో బంతికి నూర్ ఎన్ బింటి రోస్లాన్ (3)ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసింది. ఆ తర్వాతి బంతికి నూర్ ఇస్మా దానియా (0)ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి పెవిలియన్‌కు పంపించింది. ఆ తర్వాత అదే ఓవర్‌లో నాలుగో బంతికి సితి నజ్వా (0) అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసింది. మహిళల అండర్19 టీ20 ప్రపంచ కప్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా.. మొత్తంగా మూడో బౌలర్‌గా వైష్ణవి రికార్డులకెక్కింది. ఈ టోర్నమెంట్ చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేసింది.

### టీమిండియాకు భారీ విజయం..

వైష్ణవి బాల్‌తో రాణించడంతో మలేషియాపై భారత్ పది వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. అండర్-19 వరల్డ్ కప్‌లో ఇది భారత్‌కు వరుసగా రెండో విజయం. ఇంతకు ముందు వెస్టిండీస్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇక మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. వైష్ణవి, ఆయుషి శుక్లా ధాటికి మలేషియా జట్టు 14.3 ఓవర్లలోనే 31 పరుగులకు కుప్పకూలింది. మలేషియా ఇన్నింగ్స్‌లో ఎవరూ రెండంకెల స్కోర్‌ను చేరుకోలేకపోయారు. వికెట్ కీపర్ నూర్ అలియా హైరున్, హుస్నా చెరో ఐదు పరుగులు చేసి టాప్ స్కోరర్లుగా నిలిచారు. వైష్ణవి నాలుగు ఐదు వికెట్లు తీయగా.. ఆయుషి శుక్లాకు మూడు వికెట్లు దక్కాయి. జోషిత వీజే ఒక వికెట్ తీసింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టపోకుండా 2.5 ఓవర్లలో 32 పరుగులు చేసింది. ఓపెనర్ జీ త్రిసా 27 పరుగులతే అజేయంగా నిలువగా.. జీ కమలిని నాలుగు పరుగులు చేసింది.

## రంజీ బాటలో రోకో



### దేశవాళీ వైపు మళ్లుతున్న స్టార్ క్రికెటర్లు

### బీసీసీఐ ఆదేశాలతో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం

**ముంబై:** జాతీయ జట్టులో కొనసాగాలంటే దేశవాళీలు ఆడాల్సిందేనని కరాఖండీగా చెప్పిన బీసీసీఐ ఆదేశాలను భారత స్టార్ క్రికెటర్లు ఆచరణలో పెడుతున్నారు. సుమారు దశాబ్దకాలంగా డొమెస్టిక్ క్రికెట్ వైపునకు కన్నెత్తి చూడని టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ, రన్ మిషీన్ విరాట్ కోహ్లీ దేశవాళీ బాట పట్టారు. పదేండ్ల తర్వాత హిట్‌మ్యాన్‌తో పాటు కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడనున్నారు. త్వరలో జమ్ముకశ్మీర్‌తో జరుగబోయే రంజీ మ్యాచ్‌లో అతడు తన రాష్ట్ర జట్టు ముంబైకి ప్రాతినిధ్యం వహించనున్నాడు. హిట్‌మ్యాన్‌తో పాటు యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ సైతం ముంబై ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో ఉన్నారు. అజింక్యా రహానే సారథిగా వ్యవహరించనున్న ముంబై జట్టు ఈనెల 23 నుంచి జమ్ముకశ్మీర్‌తో మ్యాచ్ ఆడనుంది. సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా.. సౌరాష్ట్ర తరఫున ఆడనుండగా రిషభ్ పంత్ ఢిల్లీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఏడేండ్ల తర్వాత పంత్ దేశవాళీలు ఆడనున్నాడు.ఈ మ్యాచ్ కోసం ప్రకటించిన 22 మంది సభ్యుల జట్టులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేరున్నప్పటికీ అతడు మెడ నరాల నొప్పితో రంజీ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. కానీ ఈనెల 30న ఢిల్లీ.. రైల్వేస్‌తో ఆడబోయే మ్యాచ్‌లో కోహ్లీ బరిలోకి దిగబోతున్నాడు. ఈ విషయాన్ని డీడీసీఏ అధ్యక్షుడు రోహన్‌జైట్లీతో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టికి కోహ్లీ తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో 2012 తర్వాత తొలిసారి ఈ స్టార్ బ్యాటర్ దేశవాళీలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఇక హైదరాబాదీ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్, పంజాబ్ తరఫున శుభ్‌మన్ గిల్ సైతం వారి జట్లకు ఆడేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

## ఆ విషయంలో పెద్ద తేడా ఏం ఉండదు..!

### బీసీసీఐ పది పాయింట్ల పాలసీపై ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ కామెంట్స్..



విదేశీ పర్యటనల సమయంలో ఫ్యామిలీ సపోర్ట్ అవసరమని.. మానసిక, భావోద్వేగ సమయాల్లో వారి మద్దతు నుంచి అందుతుందని ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ పేర్కొన్నాడు. ఇటీవల బీసీసీఐ ఇటీవల కొత్త పాలసీని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. భారత్‌ఇంగ్లాండ్ మధ్య కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం తొలి టీ20 మ్యాచ్ జరుగనున్నది. మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో జోస్ బట్లర్ మాట్లాడాడు. ఆధునిక యుగంలో విదేశీ పర్యటనల సమయంలో ఆటగాళ్లతో కుటుంబం ఉండడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని బట్లర్ పేర్కొన్నాడు. ఆటగాళ్లతో భార్య, పిల్లు ఉండడం భావోద్వేగంగా సోపర్ట్ ఉంటుందని.. కఠినమైన షెడ్యూల్ సమయంలో వారి మానసిక ఆరోగ్యానికి సహాయపడుతుందన్నారు. ప్రస్తుత కాలంలో చాలా క్రికెట్ ఆడుతున్నారని.. ఆటగాళ్లు ఇంటి వెలుపలే చాలా సమయం గడుపుతున్నారన్నారు.

కుటుంబంతో కలిసి ఉండడం ఆటలో పెద్దగా తేడాలుండవని తాను అనుకోనని చెప్పాడు. కుటుంబం ఉండడం వృత్తిపరమైన కట్టుబాట్లకు ఆటంకం కలిగించదని బట్లర్ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, కుటుంబంతో కలిసి ఉండడం ద్వారా ఇంటికి దూరంగా ఉండడంతో కలిగే భారాన్ని తగ్గించుకోవచ్చని భావిస్తున్నానని చెప్పాడు. ఆస్ట్రేలియాలో ఘోర పరాజయం తర్వాత టీమిండియాపై బీసీసీఐ కొరఢా ఝుళిపించింది. పది పాయింట్స్ కూడిన మార్గదర్శకాలను విడుదల చేసింది. విదేశీ పర్యటనల సమయంలో ఆటగాళ్ల వెంట వారి కుటుంబ సభ్యులకు గతంలో మాదిరిగా అవకాశం ఉండదు. 45 రోజుల కంటే ఎక్కువ రోజులు సాగే విదేశీ పర్యటనలో మాత్రమే ఆటగాళ్ల కుటుంబానికి రెండు వారాలు అనుమతి ఇస్తారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కొత్త రూల్‌పై తన అభిప్రాయం వెల్లడించాడు. బీసీసీఐ కొన్ని మార్పులు అవసరమని గ్రహించిందని.. జట్టులో ఐక్యతను పెంచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తుందని తెలిపాడు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్..

### క్వార్టర్స్‌లో ఓడిన బొప్పన్న జోడి




**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ నుంచి బొపన్న జోడి నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో రోహన్ బొపన్న షుయ్ జాంగ్ జోడి తీవ్రంగా పోరాడినా.. 62 46 911 స్కోరు తేడాతో వైల్డ్ కార్డు ప్లేయర్లు జాన్ పీర్స్‌ఒలివియా గాడెక్కి జోడి చేతిలో ఓటమి పాలయ్యారు. కియా ఎరినాలో సుమారు గంటా 8 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్ రసవత్తరంగా సాగింది. దీంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో భారత ఆటగాళ్ల ప్రాతినిధ్యం ముగిసింది. మెన్స్ డబుల్స్ నుంచి కూడా బొపన్న నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత టెన్నిస్ ప్లేయర్లు సుమిత్ నాగల్, డబుల్స్ స్పెషలిస్టు యుకి బాంబ్రి, ఎన్న శ్రీరాం బాలాజీ కూడా ఓటమిపాలై టోర్నీ నుంచి వైదొలిగారు. ఇవాళ జరిగిన మ్యాచ్‌లో బొపన్నజాంగ్ జోడి.. తొలి సెట్‌ను కైవసం చేసుకున్నది. ఆస్ట్రేలియన్ వైల్డ్ కార్డు జోడిపై ఈజీగా ఆ సెట్‌ను గెలుచుకున్నది. కానీ సెకండ్ సెట్‌లో చైనీస్ క్రీడాకారిణి తన సర్వ్‌ను కోల్పోవడంతో.. ప్రత్యర్థులు బలం పుంజుకున్నారు. రెండో సెట్‌ను 46 తేడాతో ఆసీస్ జోడి గెలిచింది. ఇక మూడవ సెట్ ఆసక్తికరంగా సాగింది. సూపర్ టైబ్రేకర్‌లో రెండు టీంలు ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. సూపర్ టై బ్రేకర్‌లో మొదటి సర్వ్‌ను బొపన్న, జాంగ్ కోల్పయాయి. ఓ దశలో 33కు చేరుకున్నది. మళ్లీ ఓ దశలో ఆసీస్ 75 ఆధిక్యాన్ని అందుకున్నది. కానీ 88 వద్ద బొపన్న జోడికి మ్యాచ్ పాయింట్ అవకాశం ఉన్నా.. పీర్స్ దాన్ని అడ్డుకున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com